తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
బుధవారం
19 ఆగష్టు 2026
పేజీలు : 8
Follow :

# సర్వాయి' పోరాటం స్ఫూర్తిదాయకం
## కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 18 (జనంసాక్షి) :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాటం స్ఫూర్తిదాయకమని, ఆయన ఆశయాలను అందరం కొనసాగిద్దామని కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సర్వాయి పాపన్న 376వ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అధికారులు, బీసీ, గౌడ సంక్షేమ సంఘం నాయకులు సర్వాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. కల్లు గీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. కార్మికులకు ఎక్స్ గ్రేషియా, కాటమయ్య రక్షణ కిట్లు అందిస్తున్నట్లు వివరించారు. సంఘం నాయకు లతో మాట్లాడుతూ... ఎలాంటి సమస్యలున్న తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. ఐక్యం గా పని చేస్తూ, నియోజక వర్గాల వారీగా నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. చదువు, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. తమ సంఘంలో బాలికల చదువుకు పెద్దపీట వేసి వారు ఉన్నత స్థానాల్లో నిలిచేలా కృషి చేయాలన్నారు. ఎక్సైజ్ శాఖ సమన్వయంతో జిల్లాలోని 3412 మంది కల్లుగీత కార్మికులకు (అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కరీంనగర్ 463, మానకొండూర్ 933, చొప్పదండి 975, హుజూరాబాద్ 1041) కాటమయ్య సేఫ్టీ కిట్లు అందించినట్లు పేర్కొన్నారు. నగరపాలక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ మాట్లాడుతూ... జనగాం జిల్లాలో ఆయన నిర్మించిన కోట ఇప్పటికీ బ్రహ్మాండంగా ఉందన్నారు. ఆ మహనీయుడు ఆశయాలను, జీవన విధానం , దూరదృష్టి నేటి తరానికి తెలియజేయాలని పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... పాపన్నలాంటి వీరులు అన్ని వర్గాలకు స్ఫూర్తిగా, ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ స్వామి, బీసీ సంక్షేమ శాఖ అధికారి అనిల్ ప్రకాష్, వివిధ శాఖల అధికారులు, తెలంగాణ గౌడ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర గౌడ సంఘం నాయకులు పడాల స్వామి, గౌడ్ పులి ఆంజనేయులు గౌడ్ , పడాల అజయ్ గౌడ్, దూలం అంజన్న గౌడ్, తాళ్లపల్లి ఎల్లగౌడ్, మాచర్ల ఆంజనేయులు గౌడ్ , బుర్ర ముత్తయ్య గౌడ్, సాగర్ గౌడ్ నరసయ్య గౌడ్, రాజు గౌడ్, రమేష్ గౌడ్, మహిళా నాయకులు సుజాత గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు రామగుండంలో రేపు జరిగే సభను
# విజయవంతం చేయాలి..

○ రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పిలుపు

**అంతర్గాం, జనంసాక్షి :** రామగుండం నియోజకవర్గంలో బుధవారం నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పిలుపునిచ్చారు. మంగళవారం రామగుండంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన సభకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రామగుండం నియోజకవర్గ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసేందుకు రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తదితరులు హాజరుకానున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు స్మార్ట్ కార్డులు, రేషన్ కార్డుల పంపిణీ చేపట్టడం, వేయి మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందించనున్నట్లు చెప్పారు. అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ఇండ్ల పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. గతంలో రామగుండాన్ని మహానగరంగా తీర్చిదిద్దుతామని మాట ఇచ్చామని, ఆ దిశగా ప్రస్తుతం రామగుండం నవ నిర్మాణం కొనసాగుతోందని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు. రామగుండం నియోజకవర్గ కుటుంబ సభ్యులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. విలేకరుల సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రుల పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలి:కలెక్టర్ కోయ శ్రీహర్ష

○ మంథనిలో ఎన్ ఏ సి భవన నిర్మాణానికి భూమిపూజ
○ స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, బహిరంగ సభకు పక్కా ఏర్పాట్లు చేయాలి
○ మంథనిలో పర్యటించి పలు కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్



**పెద్దపల్లి,ఆగస్టు 18(జనంసాక్షి) :** మంథని నియోజకవర్గంలో బుధవారం లిరాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిళ్ళ శ్రీధర్ బాబు, ఇతర మంత్రులు పర్యటించనున్న నేపథ్యం లో అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధి కారులను ఆదేశించారు. మంగళవారం మంథని పట్టణంలో పర్యటించిన లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి, గంగపురిలో రేపు భూమిపూజ చేయనున్న (ఎన్ ఏ సి)భవన నిర్మాణ స్థలాన్ని, బస్సు డిపో సమీపంలో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన ప్రాంతాలను, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్న కార్యక్రమాల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మంథనిలో ఎన్ ఏ సి భవన నిర్మాణా నికి భూమిపూజతో పాటు రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగనున్నాయని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంతో పాటు బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. మంత్రుల పర్యటనకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తిచేసి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మంథని పట్టణంలో ప్రత్యేక పారిశు ధ్య కార్యక్రమాలు చేపట్టి పరిశుభ్రంగా ఉంచాలని, మంత్రులు పర్యటించే మార్గాలను ముందుగానే పరిశీలించి ఎలాంటి ఆటంకాలు లేకుండా రోడ్లు, పరిసరాలను క్లియర్ చేయాలని సూచించారు. పర్యటన షెడ్యూల్ ప్రకారం అన్ని కార్యక్రమాలు నిర్ణీత సమయానికి జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమాల నిర్వహణలో సమయ పాలనకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి కార్యక్రమా నికి అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచిం చారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వాహనాల పార్కిం గ్, బారికేడింగ్ తదితర ఏర్పాట్లను పూర్తిస్థాయిలో చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశిం చారు. మంత్రుల పర్యటన విజయవంతంగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్య లను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్, వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ ఆ రిఫుద్దీన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నేడు జరిగే మంత్రుల సభ స్థలిని పరిశీలించిన ప్రభుత్వ విప్ విజయ రమణారావు

**సుల్తానాబాద్,ఆగస్టు 18(జనంసాక్షి) :** నేడు జరిగే మంత్రుల అభివృద్ధి పర్యటన సభ స్థలిని, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గల ఏర్పాట్లను ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పార్టీ శ్రేణులు అధికారులతో కలిసి సందర్శించారు. దాదాపు 250 కోట్ల అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు దుద్దిళ్ల శ్రీధర్ బాబు కోమటిరెడ్డి వెంకటరెడ్డి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు పొన్నం ప్రభాకర్ గౌడు హాజరుకానున్నారు. పెద్దపెల్లి నియోజకవర్గం నుండి దాదాపు 5000 లు మించకుండా జన సమీకరణ చేస్తున్నారు. అంతేకాకుండా పెద్దపల్లి జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు అభిమానులు కార్యకర్తలు మహిళలు ఎన్ ఎస్ యు ఐ యూత్ కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ తో పాటు పెద్ద ఎత్తున సభకు తరలివచ్చే అవకాశం ఉన్నందున, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి లో భాగంగా 250 కోట్లతో రోడ్లకు మంత్రులు శంకుస్థాపన చేయనున్నట్లు, పెద్దపల్లి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి పార్టీ శ్రేణులు కార్యకర్తలు నాయకులు మహిళలు మిగతా 12లో

## ఘనంగా సర్వాయి పాపన్న గౌడ్ జయంతి



**సదాశివనగర్ ఆగస్టు 18 (జనంసాక్షి)** సదాశివనగర్ మండలంలోని పద్మాజీవాడి ఎక్స్‌రోడ్డు లో వీరశిరోమణి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను గౌడ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపన్న గౌడ్ సమాజ సేవ, ధైర్యసాహసాలు, అణగారిన వర్గాల అభ్యున్నతికి చేసిన కృషిని పలువురు వక్తలు కొనియాడారు. యువత పాపన్న గౌడ్ ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## కుట్టు నేర్చుకున్న మహిళలకు పత్రాలు ప్రదానం



**గన్నేరువరం, ఆగస్టు 18 (జనంసాక్షి):** గన్నేరువరం మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్ శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న మహిళలకు మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఇటువంటి వృత్తి నైపుణ్య శిక్షణలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాన్ని మెరుగుపర్చుకుంటూ ఇంటి వద్దనే ఉపాధి పొందడంతో పాటు, ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని, మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేలా అవసరమైన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. శిక్షణ కార్యక్రమాలను నిర్వహించిన లయన్స్ క్లబ్ నిర్వాహకులను అభినందించిన ఆయన, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కరీంనగర్ జిల్లా లయన్స్ క్లబ్ గవర్నర్ మోర భద్రేశం కృష్ణ హరి, కొల్లూరి ఆనందమ్, పెద్ది లక్ష్మీకాంతం, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బొద్దు బాలయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొద్దు సునిల్, పార్టీ నాయకులు కొమ్మెర రవీందర్ రెడ్డి, పులి కృష్ణ, అరికాంతం అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# ఆరోగ్యం క్రమశిక్షణ అప్రమత్తతే వీఐపీ భద్రతకు బలం



**గోదావరిఖని, జనంసాక్షి :** వీఐపీ భద్రతా విధుల్లో ఉన్న పిఎస్ఓలు అత్యంత అప్రమత్తతతో, క్రమశిక్షణతో, వృత్తి నైపుణ్యంతో విధులు నిర్వహించాలని రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. సీపీ ఆదేశాల మేరకు మంగళవారం రామగుండం పోలీస్ కమీషనరేట్‌లో వీఐపీ భద్రతా విధుల్లో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, సమాచార మార్పిడి, సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన తదితర అంశాలపై పిఎస్ఓలకు సంక్షిప్త శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పిఎస్ఓలకు ఆరోగ్యం, శారీరక దారుఢ్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. మంచి అలవాట్లు, క్రమశిక్షణ, నిజాయితీ, విశ్వసనీయతతో విధులు నిర్వహించి పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావా లన్నారు. ప్రజలతో నేరుగా సంబంధం కలిగిన పిఎస్ఓలు ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతి, అక్రమ ప్రయోజనాలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం డబ్బులు తీసుకోవడం పూర్తిగా తప్పని తెలిపారు. ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టిలో పోలీసులపై నమ్మకం పెరిగేలా బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని సూచించారు. వీఐపీ భద్రతలో అనూహ్య పరిస్థితులు ఎప్పుడు ఎదురవుతాయో ముందుగా చెప్పలేమని, అందువల్ల పిఎస్ఓలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా, సిద్ధంగా ఉండాలని తెలిపారు. పరిసరాలను నిశితంగా పరిశీలించడం, పరిస్థితిని అంచనా వేయడం, తక్షణ నిర్ణయం తీసుకోవడం వంటి సామర్థ్యాలు పిఎస్ఓలకు అత్యంత ముఖ్యమన్నారు. పోలీస్ శాఖలో పొందిన శిక్షణ, అనుభవం పిఎస్ఓలకు ప్రత్యేక బలమని తెలిపారు. కవాతు సాధన, కృత్రిమ విన్యాసాలు, నిరంతర శిక్షణ ద్వారా తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. విధి నిర్వహణ సమయంలో పరిసరాలను నిరంతరం గమనిస్తూ, అనుమానాస్పద కదలికలు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. వీఐపీ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని గోప్యంగా ఉంచాలని, సామాజిక మాధ్యమాల్లో అనధికారికంగా పంచుకోరాదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో శాఖా నియమావళికి అనుగుణంగా ప్రశాంతంగా, వేగంగా స్పందించాలని తెలిపారు. వీఐపీ భద్రతలో ప్రతి క్షణం అప్రమత్తత, ప్రతి చర్యలో క్రమశిక్షణ, ప్రతి నిర్ణయంలో బాధ్యత ఉండాలి" అని సీపీ అంబర్ కిషోర్ ఝా స్పష్టం చేశారు. ఈ సంక్షిప్త శిక్షణలో భద్రతా విధులు, శారీరక దారుఢ్యం, అప్రమత్తత, సమాచార మార్పిడి, సమన్వయం, అత్యవసర పరిస్థితుల్లో స్పందన, సమాచార గోప్యత, వృత్తి నైపుణ్యం తదితర అంశాలపై పిఎస్ఓలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ ఏసీపీలు ప్రతాప్, రమేష్, ఆర్ఐలు శేఖర్, దామోదర్, రమేష్, మల్లేశం, సీసీ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# మైనర్లు బైక్ నడిపితే తప్పు బస్సులు లేకపోతే బాధ్యత ఎవరిది







**సిరికొండ, ఆగస్టు 17 (జనం సాక్షి):** సిరికొండ మండల కేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పీఎం శ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ ప్రారంభమైనప్పటి నుంచి పలు సమస్యలతో కొనసాగుతోంది. మండలంలోని వివిధ గ్రామాల నుంచి సుమారు 650 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నప్పటికీ, వారికి అవసరమైన రవాణా సౌకర్యం, రహదారి, డ్రైనేజీ తదితర మౌలిక వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక్క బస్సుతో 650 మంది విద్యార్థులకు ఎలా? పాఠశాలకు ప్రధాన సమస్య రవాణా సౌకర్యం. ప్రస్తుతం ఉదయం సుమారు 9 గంటలకు ఒక బస్సు పాఠశాల వైపు వస్తుండగా, తిరిగి సాయంత్రం 4:30 గంటలకు అదే బస్సు విద్యార్థులను తీసుకెళ్తోంది. సుమారు 650 మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలకు ఒక్క బస్సు మాత్రమే ఉండటంతో అందరికీ సరైన రవాణా సౌకర్యం అందడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. మండలంలోని 5 నుంచి 10 కిలోమీటర్ల దూరంలోని గ్రామాల నుంచి కూడా విద్యార్థులు నిత్యం పాఠశాలకు వస్తున్నారు. బస్సు సౌకర్యం లేని విద్యార్థుల్లో కొందరిని తల్లిదండ్రులు ఉదయం పాఠశాలలో దింపి, సాయంత్రం తిరిగి తీసుకెళ్తున్నారు. అయితే ఉద్యోగాలు, వ్యవసాయ పనులు, ఇతర బాధ్యతల కారణంగా ప్రతి తల్లిదండ్రికి ఇది సాధ్యంకాని పరిస్థితి. దీంతో కొందరు విద్యార్థులు ప్రైవేట్ వాహనాలు, ఆటోలను ఆశ్రయిస్తుండగా, మరికొందరు సైకిళ్లపై, కాలినడకన పాఠశాలకు వస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే కొందరు విద్యార్థులు ద్విచక్ర వాహనాలపై ఆధారపడుతున్న పరిస్థితి కూడా కనిపిస్తోంది. మైనర్లు బైక్ నడిపితే బాధ్యత ఎవరిది? 18 సంవత్సరాల వయస్సు నిండని విద్యార్థులకు తల్లిదండ్రులు ద్విచక్ర వాహనాలు ఇవ్వడం చట్టవిరుద్ధమే. పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలి. అయితే మరోవైపు వందలాది మంది విద్యార్థులు చదువుతున్న మోడల్ స్కూల్‌కు సరైన ప్రజా రవాణా సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వం, సంబంధిత అధికారులపై కూడా ఉంది. ఒకవైపు మైనర్లు బైక్‌లు నడపకూడదని నిబంధనలు విధిస్తూ, మరోవైపు పాఠశాలకు వెళ్లేందుకు తగిన బస్సు సౌకర్యం కల్పించకపోతే సమస్యకు పరిష్కారం ఎలా లభిస్తుందనే ప్రశ్న తల్లిదండ్రుల నుంచి వినిపిస్తోంది. 18 సంవత్సరాల వయస్సు నిండని, డ్రైవింగ్ లైసెన్స్ లేని విద్యార్థులకు తల్లిదండ్రులు బైక్‌లు, స్కూటీలు ఇవ్వవద్దని సూచించారు. మైనర్లు వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, విద్యార్థుల భద్రతే పాఠశాల యాజమాన్యానికి ప్రధానమని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి మైనర్ విద్యార్థులు వాహనాలతో వస్తే పాఠశాల ఆవరణలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు, విద్యార్థులు పాఠశాల నిబంధనలకు సహకరించాలని కోరారు. అధ్వానంగా రోడ్డు.. భారీ వాహనాలతో మరింత నష్టంపాఠశాలకు వెళ్లే రహదారి పరిస్థితి కూడా విద్యార్థులకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికీ సింగిల్ రోడ్డు మాత్రమే ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మోడల్ స్కూల్ వెనుక భాగంలో ప్రభుత్వ గోడౌన్లు ఏర్పాటు చేయడంతో భారీ వాహనాల రాకపోకలు పెరిగాయి. హెవీ వెహికల్స్ రాకపోకల కారణంగా రోడ్డు మరింత దెబ్బతింటోందని స్థానికులు చెబుతున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రజలు నిత్యం ప్రయాణించే ఈ రహదారిని విస్తరించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఇప్పటివరకు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పాఠశాలకు అదనపు బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు రహదారిని అభివృద్ధి చేయాలని, ప్రభుత్వ గోడౌన్లకు వచ్చే భారీ వాహనాల రాకపోకలను దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణ చేపట్టాలని, వర్షాకాలంలో నీరు నిలవకుండా శాశ్వత డ్రైనేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# ఎస్సీ సి వర్గీకరణ ఫలాలను విద్యార్థి విద్యార్థులకు అవగాహన



**ముస్తాబాద్ ఆగస్టు 18( జనం సాక్షి)**ముస్తాబాద్ మండల కేంద్రంలోని విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొమ్మెట రాజు ఆధ్వర్యంలో సిరిసిల్ల జిల్లా ఇన్చార్జి పుట్ట రవి మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు 33 జిల్లాలలో జిల్లా కమిటీలతోపాటు మండల కమిటీలు గ్రామ కమిటీలు నిర్వహించి గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీ నిర్వహించి ఈనెల చివరి వారంలో మండల కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుంది దీనికి విద్యార్థులు మేధావులు మాదిగ రాజకీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని కమిటీలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతంలో విద్యార్థులు పదో తరగతి వరకు చదువుకొని మధ్యలోనే ఆపేయడం జరుగుతుంది అలా కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్నటువంటి శిక్షణ తీసుకొని పై చదువులకు వెళ్లాలని మందకృష్ణ మాదిగ గారి పిలుపు ఈ మేరకు ప్రతి ఒక్కరూ చదువుకున్న మేధావులు గ్రామీణ ప్రాంత ఎస్సీ మాదిగ ఉపకులాలకు వారి గ్రామాలలో పై చదువుల కొరకు అవగాహన కల్పించే విధంగా ప్రయత్నించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు చుంచు మల్లన్న, జిల్లా కన్వీనర్ ఎనగందుల బిక్షపతి, ఎం ఎస్ పి జిల్లా నాయకులు ఖానాపురం లక్ష్మణ్, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు కొల్లూరి నాగరాజు, నల్ల సంతోష్ ఎమ్మార్పీఎస్ సంబంధించిన నాయకులు పాల్గొన్నారు

# సమయపాలన పాటించని ఫెర్టిలైజర్ యజమాని



**ముత్తారం ఆగస్టు 18(జనంసాక్షి):** ముత్తారం మండలంలో ఓ ఫెర్టిలైజర్ యజమాని వ్యవహారశైలిపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. యూరియా కోసం వచ్చే రైతులు తప్పనిసరిగా యూరియాతో పాటు ఇతర ఎరువులు కూడా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో, తమ అవసరానికి మించి ఇతర ఎరువులను కొనుగోలు చేయాలని ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. అదేవిధంగా, రైతులతో అవహేళనగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.మరోవైపు, ఫెర్టిలైజర్ దుకాణం నిర్వహణలో సమయపాలన పాటించడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దుకాణం ప్రారంభ, ముగింపు వేళల విషయంలో నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశంపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు .అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి రైతులకు అవసరమైన ఎరువులు నిబంధనల ప్రకారం అందేలా చూడటంతో పాటు, యూరియాతో పాటు ఇతర ఎరువులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత మండల అధికారులు విచారణ చేపట్టాలని రైతులు ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత ఫెర్టిలైజర్ యజమానిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు

# తెలంగాణ వీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్



**రాయికల్ ఆగస్టు 18 జనం సాక్షి** :తెలంగాణ వీరత్వానికి పరాక్రమానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీక అని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం రోజున రాయికల్ మండలం అల్లిపూర్ గ్రామంలో సర్వాయి పాపన్న జయంతి వేడుకల సందర్భంగా కచీర్ చౌరస్తా వద్ద స్థానిక గీత కార్మిక పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బహుజన రాజ్యాధికార పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. జీవన్ రెడ్డి మరియు జగిత్యాల జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత తో కలిసి ఆవిష్కరించారు. పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి కొబ్బరికాయ కొట్టి సర్వాయి పాపన్న కు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ.జీవన్ రెడ్డిమాట్లాడుతూ..బహుజనుల పోరాట యోధుడు, తెలంగాణ ప్రాంతాన్ని కాపాడిన ధీరుడు శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న మహారాజు 376 వ జయంతి వేడుకల్లో విగ్రహ ఆవిష్కరణ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. సబ్బండ వర్గాలకు ఆత్మగౌరవ స్ఫూర్తిగా నిలిచి ఆనాటి సమాజంలో నెలకొన్న నిరంకుశ రాజరిక పోకడలకు వ్యతిరేకంగాసబ్బండ వర్గాలను ఏకం చేసి పాపన్న పోరాడిన తీరు గొప్పదని అన్నారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తూ బడుగు బలహీన వర్గాల నాయకత్వాన్ని సముచితంగా గౌరవించుకుంటున్నదని కొనియాడారు.జగిత్యాల జిల్లా మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత మాట్లాడుతూ..అణగారిన వర్గాల మధ్య నుంచి ఎదిగి, వారినే తన పోరాట శక్తిగా మలుచుకుని తెలంగాణ నేలపై స్వీయ పాలనకు పునాది వేసిన అసాధారణ ప్రజా యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. సుమారు మూడున్నర శతాబ్దాల క్రితమే సామాజిక అసమానతలు, దోపిడీ, ఆధిపత్యానికి వ్యతిరేకంగా ప్రజల ఆత్మగౌరవం కోసం పోరాడిన పాపన్న ఒక వ్యక్తి మాత్రమే కాదు.. ఒక చారిత్రక తిరుగుబాటు. సామాన్యుడి నుంచి నాయకుడిగా, యోధుడిగా, పాలకుడిగా ఎదిగి తన కాలంలోని అధికార వ్యవస్థను సవాలు చేసిన ప్రజా వీరుడు అని అన్నారు.అణచివేత, వివక్షకు వ్యతిరేకంగా పాపన్న గౌడ్ ప్రదర్శించిన ఆత్మగౌరవ పోరాట స్ఫూర్తిని తెలంగాణ రాష్ట్రం కొనసాగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గౌతమి వెంకటేష్, ఉప సర్పంచ్ వినయ్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచులు ఉప సర్పంచులు, మాజీ ఎంపీటీసీ బాలే చంద్రశేఖర్, మాజీ కో ఆప్షన్ మెంబర్ ముఖిద్, వివిధ కుల సంఘాల పెద్దమనుషులు, ప్రజా ప్రతినిధులు అధికారులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ప్రయాణం



**ముస్తాబాద్ ఆగస్టు 18( జనం సాక్షి )**ముస్తాబాద్ మండలం గోపాల్‌పల్లి కెనాల్ కాలువ వద్ద సరైన రహదారి, బ్రిడ్జి లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సరైన దారి లేకపోవడంతో కార్లు, ద్విచక్ర వాహనదారులు కాలువలో పడే పరిస్థితి నెలకొంది.గత కొన్ని రోజుల క్రితం కూడా కారు,ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం తృటిలో తప్పింది.ఇప్పటికే దాదాపు నాలుగైదు ఘటనలు చోటుచేసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు.ఓ వాహనదారుడు కాలువలో పడిన సమయంలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో ప్రాణాపాయం తప్పింది.మరోవైపు నీరు ప్రవహిస్తున్న సమయంలో వాహనం కాలువలో పడితే పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.చిన్నపాటి పొరపాటు జరిగినా ప్రాణనష్టం జరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి రోడ్డు నుండి వెళ్లాలంటే మరో వాహనము నిలుపాల్సిన పరిస్థితి నెలకొంటుంది.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గోపాల్‌పల్లి బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని,బ్రిడ్జినిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి వాహనదారులకు సురక్షితమైన రాకపోకల మార్గం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఆలూరు ప్రాథమిక పాఠశాలలో ఏఎక్స్ఎల్ ల్యాబ్ ప్రారంభం



రాయికల్ ఆగస్టు18జనం సాక్షి: రాయికల్ మండలం ఆలూరు గ్రామంలో మంగళవారం రోజున జిల్లా విద్యాశాఖధికారి డీఈవో శ్రీ రాము ఏఎంఓ చంద్రశేఖర్ రెడ్డి ఎంఈఓ రాఘవులు కలిసి ఆలూరు ప్రాథమిక పాఠశాలలో ఏ ఎక్స్ ఎల్ ల్యాబ్ ను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో రాము మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు ( ఏఎల్ ) ద్వారా విద్యా బోధన అధికారికంగా ప్రారంభమైందని తెలిపారు. దీనివల్ల విద్యార్థులు ఎంతో ఆనందంగా సులువుగా తెలుగు,ఇంగ్లీష్,గణితంలో వేగంగా నైపుణ్యాలు సాధిస్తున్నారని అన్నారు.అనంతరం డీఈవో మరియు ఏఎంఓ శ్రీ చంద్రశేఖర్ రెడ్డి తరగతి గదులను సందర్శించి, విద్యార్థుల అభ్యసన ప్రగతిని స్వయంగా పరిశీలించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్లాల స్వామి పాఠశాల ప్రధానోపాధ్యాయులు సతీష్, ఏఏపిసి చైర్మన్ విజయ, పాఠశాల విద్యాభివృద్ధి కమిటీ చైర్మన్ చిలుక సంజీవ్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు నల్లాల శేఖర్,మాజీ సర్పంచ్ గంగాధర్ పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు సునీత,సాయికృష్ణ,రమేష్ రెడ్డి,రాజేశం ,మానస మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.



## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ



**ముస్తాబాద్ ఆగస్టు 18 (జనం సాక్షి)**ముస్తాబాద్ మండల బంధనకల్ గ్రామంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో గౌడ కుల సంఘం అధ్యక్షులు గుర్రం బాలగౌడ్ , విగ్రహ దాత గ్రామ మాజీ సర్పంచ్ గుర్రం వెంకటేశ్వరి , బదనకల్ గ్రామ సర్పంచ్ ముస్తాబాద్ సర్పంచుల ఫోరం అధ్యక్షులు చిగురు నరేష్ గ్రామపంచాయతీ పాలకవర్గం.గౌడ కుల సంఘం ఉపాధ్యక్షులు చింతల నాగరాజు, విచ్చేసినటువంటి మాజీ జెడ్పిటిసి మెరుగు యాదగిరి గౌడ్ , మెరుగు అంజా గౌడ్ , ఆత్మ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్ , బీసీ స్టడీ డైరెక్టర్ సర్పంచ్ వెంకటస్వామి , వెంకటస్వామి గౌడ్ మాజీ ఎంపీపీ స్వప్న రవీందర్ గౌడ్ , గ్రామంలోని అన్ని కుల సంఘాల అధ్యక్షులు గౌడ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న చేసినటువంటి సేవలను కొనియాడారు రేపటి యువకులకు సర్దార్ పాపన్న జీవిత చరిత్రను తెలియజెప్పారు. సేవలను కొనియాడడం జరిగింది గ్రామ సర్పంచ్ చిగురు నరేష్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గారి 376 వ జన్మదిన వేడుకలు సందర్భంగా మొగల్ చక్రవర్తులతో వారు పోరాడిన విధానం గేరెల్లా యుద్ధ సన్నాహకాలను వారు ఏర్పరచుకున్న 12వేల సైన్యాన్ని గురించి బడుగు బలహీన వర్గాల ప్రజలకు చక్రవర్తిగా అగ్రవర్ణాల ఆధిపత్యాన్ని తరిమికొట్టారు

## పాపన్న గౌడ్‌కు బండి సంజయ్ ఘన నివాళులు



**కరీంనగర్ కల్చరల్ ఆగస్టు 18 (జనం సాక్షి)**రేకుర్తి 19వ డివిజన్ జగిత్యాల మెయిన్‌రోడ్ చౌరస్తాలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, 19వ డివిజన్ కార్పొరేటర్ సుదగోని మాధవి-కృష్ణగౌడ్ తదితరులు పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. మొఘల్ పాలకుల అరాచకాలను ఎదిరిస్తూ అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన మహాయోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కొనియాడారు. సామాన్యుడిగా ప్రారంభమై గొప్ప పరాక్రమవంతుడిగా ఎదిగిన ఆయన జీవితం స్ఫూర్తిదాయకమన్నారు. మొఘుల్ పాలకుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా చేసిన పోరాటంతో పాపన్న గౌడ్ చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని తెలిపారు.జయంతి వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులు, కులబాంధవులు, డివిజన్ ప్రజలు, యువజన సంఘాల నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు పావని గౌడ్, రేకుర్తి గౌడ సంఘం సభ్యులు, కుల సంఘాల నాయకులు, డివిజన్ ప్రజలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణ చట్టాల అమలులో రాజీ పడొద్దు



**గోదావరిఖని,ఆగస్టు 18 జనంసాక్షి** :శాంతిభద్రతల పరిరక్షణలో,చట్టాల అమలులో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పోలీసు అధికారులను ఆదేశించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా మంగళవారం గోదావరిఖని ఏసీపీ కార్యాలయాన్ని పోలీస్ కమిషనర్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్ పుష్పగుచ్ఛం అందజేసి సీపీకి స్వాగతం పలికారు. అనంతరం సాయుధ పోలీసులు గౌరవ వందనం సమర్పించారు.ఏసీపీ కార్యాలయంలోని వివిధ రికార్డులను సీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. డివిజన్ పరిధిలో దర్యాప్తులో ఉన్న కేసులు,వాటి పురోగతి,నిందితుల అరెస్టులు,ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద నమోదైన కేసుల స్థితిగతులు,పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు.కేసుల దర్యాప్తులో జాప్యానికి గల కారణాలను ఏసీపీ రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు.రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి,వారి కదలికలను నిరంతరం పర్యవేక్షించాలని సీపీ సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే కార్యక లాపాలపై అప్రమత్తంగా ఉండాలని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సివిల్, భూవివాదాల్లో పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకోకుండా, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా మాత్రమే వ్యవహరించాలని సీపీ స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ అందించడంతో పాటు, ప్రతి కేసును నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.తనిఖీ అనంతరం పోలీసు అధికారులతో కలిసి ఏసీపీ కార్యాలయ ఆవరణలో సీపీ మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి, గోదావరిఖని సబ్ డివిజన్‌కు చెందిన సీఐలు,ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు



**ముత్తారం ఆగస్టు 18(జనంసాక్షి)**: వరి సాగుపైనే ఆధారపడకుండా రైతులు ఆరుతడి పంటలతో పాటు కూరగాయలు,పూలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మంథని డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. అంజని సూచించారు. తక్కువ నీటితో సాగయ్యే పంటలను ఎంచుకోవడం ద్వారా సాగునీటిని ఆదా చేయడంతో పాటు రైతులకు నిరంతర ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు .మంగళవారం ముత్తారం మండలం మచ్చుపేట గ్రామానికి చెందిన రైతు పందిళ్ల రామ్మూర్తి సాగు చేస్తున్న బంతి, సీతమ్మ పూల తోటలను అంజని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూల సాగుకు చేస్తున్న ఖర్చు, పంట దిగుబడి, మార్కెటింగ్, ప్రస్తుతం లభిస్తున్న ధరలు తదితర వివరాలను రైతును అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరికి అధికంగా నీరు అవసరమవుతుందని, అందుబాటులో ఉన్న నీటి వనరులను దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు .కంది,పెసర ,మినుము వంటి పప్పుదినుసులు,నువ్వులు వంటి నూనెగింజలతో పాటు బంతి,సీతమ్మ పూలు,కాకర, బీర,సొరకాయ, బెండ,అలసంద వంటి కూరగాయలను సాగు చేస్తే వివిధ దశల్లో ఆదాయం పొందవచ్చన్నారు.ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యాన్ని పాటించడం వల్ల మార్కెట్ పరిస్థితుల ప్రభావాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చని అంజని తెలిపారు.భూమిని ఖాళీగా ఉంచకుండా సద్వినియోగం చేసుకోవడంతో పాటు అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకునే అవకాశం ఉంటుందన్నారు.ఆయిల్‌పామ్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, రైతులకు రాయితీలు అందు బాటులో ఉన్నాయని తెలిపారు. బిందు సేద్యానికి కూడా ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు .ప్రస్తుతం ఆయిల్‌పామ్ గెలల ధర టన్నుకు సుమారు రూ.23 వేల వరకు ఉందని పేర్కొన్నారు.జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ (చీవీచీఖీ)లో భాగంగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అవలంబించే రైతులకు ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయని అంజని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగుమందులను వ్యవసాయ శాఖ సిఫారసుల మేరకే వినియోగించాలని సూచించారు.పీఎం కిసాన్ పథకం కింద రూ.2,000 పొందుతున్న ప్రతి రైతు తమ సంబంధిత ఏఈఓల వద్ద ఫేషియల్ ఈ-కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఆమె సూచించారు.వ్యవసాయ శాఖ అందిస్తున్న పథకాలు, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జే.అనుష,ఏఈఓలు శశిధర్, మనీషా,కృషి సఖీలు సౌఖ్య,కోమలత,విత్తన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఖేలో ఇండియాలో యోగా సిలబస్ మార్చాలి



**కరీంనగర్ఆగస్టు 18(జనంసాక్షి** ఖేలో ఇండియా యోగా పోటీల సిలబస్‌ను మార్చాలని తెలంగాణ యోగ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి సిద్దారెడ్డి మంగళవారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం అందించారు .భారతీయ సంస్కృతికి ప్రతీక అయిన యోగాలో 1951 నుంచి యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలు నిర్వహిస్తోందని తెలిపారు. యోగాకు సంబంధం లేని కొందరు యోగాసనా భారత్ పేరుతో ఆయుష్ శాఖ ద్వారా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందారని ఆరోపించారు.ఈ వ్యవహారంపై యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా కోర్టును ఆశ్రయించగా, సుదీర్ఘ చరిత్ర కలిగిన సంస్థగా వైఎఫ్ఐ దేశంలో యోగా అభివృద్ధికి కృషి చేసిందని పేర్కొంటూ సమస్యను రెండు నెలల్లో పరిష్కరించాలని కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖను ఆదేశించినట్లు సిద్దారెడ్డి తెలిపారు.ప్రాచీన యోగ సంప్రదాయాలకు అనుగుణంగా, భారతీయ సంస్కృతితో ముడిపడి ఉన్న సిలబస్‌తో ఖేలో ఇండియా యోగా పోటీలు నిర్వహించాలని ఆయన కోరారు. సిలబస్‌తో పాటు అఫ్లికేషన్ అంశంపై కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖతో మాట్లాడతానని బండి సంజయ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# పేదలు రైతులకు అండగా నిలిచే పథకాలను కొనసాగించాలి



**సిరికొండ, ఆగస్టు 18(జనం సాక్షి ):** కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతుబీమా పథకాలను యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ సిరికొండ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవన్న, బీఆర్ఎస్ పార్టీ నిజామాబాద్ రూరల్ ఇన్‌చార్జి బాజిరెడ్డి జగనన్న పిలుపు మేరకు ఈ నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సాయి చరణ్ మాట్లాడుతూ.. ఆనాడు తెలంగాణ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఇంట్లో మేనమామలా అండగా నిలిచి ఆడపిల్లల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేలా కళ్యాణలక్ష్మి పథకాన్ని తీసుకువచ్చారని అన్నారు. అలాగే రైతుల కోసం రైతుబీమా పథకాన్ని అమలు చేసి రైతు కుటుంబాలకు భరోసా కల్పించారని తెలిపారు. అయితే ప్రస్తుతం రైతుబీమాకు సంబంధించిన ప్రీమియం చెల్లించకుండా ప్రభుత్వం రైతుబీమా పథకానికి ఎగనామం పెడుతోందని ఆరోపించారు. తక్షణమే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ బకాయిలతో పాటు రైతుబీమా నిధులు విడుదల చేయాల డిమాండ్ చేశారు. పేద కుటుంబాలు, రైతులకు అండగా నిలిచే ఈ పథకాలకు చట్టబద్ధత కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు అండగా నిలిచే కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల బకాయిలను వెంటనే మంజూరు చేయాలని, అర్హులైన ప్రతి రైతు కుటుంబానికి రైతుబీమా ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సర్పంచ్ లు సాయి చరణ్, మైపాల్, రాజ్‌కుమార్, సిరికొండ మాజీ ఎంపీపీ ప్రకాష్, మాజీ సొసైటీ చైర్మన్ మైలారం గంగారెడ్డి, తోట రాజన్న, భూషణ్‌రెడ్డి, రామడుగు సురేందర్, మాజీ సర్పంచ్ రాజారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ఫిలిప్స్ నర్సారెడ్డి, మాజీ సర్పంచులు, సొసైటీ వైస్ చైర్మన్ అబ్బాస్, చీమన్‌పల్లి మాజీ సర్పంచ్ శివారెడ్డి, హుస్సేన్‌నగర్ మాజీ సర్పంచ్ తిరుపతి, సిరికొండ మాజీ ఎంపీటీసీ కిషన్, మైలారం దయానంద్, న్యావనంది మాజీ ఉపసర్పంచ్ రమేష్‌రెడ్డి, న్యావనంది గ్రామ శాఖ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్‌లోకి కొనసాగుతున్న చేరికలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (జనం సాక్షి)**ఎమ్మెల్యే మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన ముస్తాపూర్ గ్రామ ,ప్రజాప్రతినిధులుఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలో చేరికలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే మదన్ మోహన్ నాయకత్వంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై లింగంపేట్ మండలం ముస్తాపూర్ గ్రామానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముస్తాపూర్ గ్రామానికి చెందిన 1వ వార్డు సభ్యుడు మాల కమ్మరి సంగయ్య, 2వ వార్డు సభ్యురాలు బోరంచ బాలమణి, 3వ వార్డు సభ్యురాలు వడ్ల సంధ్య, 4వ వార్డు సభ్యుడు నస్కంటి పెద్దకాంతం, 5వ వార్డు సభ్యురాలు నీరెడ్డి రజనీత్, 6వ వార్డు సభ్యుడు, ఉపసర్పంచ్ బి. రాజు, 7వ వార్డు సభ్యుడు సంజీవులు, 8వ వార్డు సభ్యుడు సభ సర్దార్ తదితరులు ఎమ్మెల్యే మదన్ మోహన్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మదన్ మోహన్ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతంగా కొనసాగిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సంక్షేమ ఫలాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రత్యక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని పార్టీలో చేరిన నాయకులు తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజల్లో కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం మరింత పెరుగుతోందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగస్టు 18 (జనం సాక్షి);**సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిం చగా, ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్,అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సౌజన్య, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, సీపీఓ శ్రీనివాసాచారి, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ స్వప్న, గౌడ సంఘం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్ మానేరు బ్రిడ్జిపై ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి



**కరీంనగర్ టౌన్ ఆగస్టు 18, ( జనం సాక్షి)**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు అలుగునూర్ చౌరస్తాలోని పాపన్న విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు పరశురాం గౌడ్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో జిల్లా అధికారులు, గౌడ సంఘాల ప్రతినిధులు, గోప, బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ వీరోచిత పోరాటాలను, అణగారిన వర్గాల ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటాన్ని నాయకులు స్మరించుకున్నారు. సర్వాయి పాపన్న జయంతి కేవలం ఓ వీరుడి జయంతి కాదని, తెలంగాణ బహుజనుల ఆత్మగౌరవ పోరాట చరిత్రను గుర్తుచేసుకునే రోజని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర పరశురాం గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుమ్మటి రాజమల్లు గౌడ్, రమేష్ గౌడ్, నర్సాగౌడ్, బత్తిని కన్నయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్, సంధ్య గౌడ్, నాగుల కనకయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.




## పట్టణ సమస్యల పరిష్కారానికి బీజేపీ కౌన్సిలర్ల జిల్లా అదనపు స్థానిక కలెక్టర్ గిరి కి వినతి పత్రం అందజేత



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (జనం సాక్షి)**కామారెడ్డి పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న శానిటేషన్, తాగునీరు, వీధి దీపాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ బీజేపీ కౌన్సిలర్లు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) గిరికి వినతిపత్రం సమర్పించారు. వర్షాకాలం నేపథ్యంలో చెత్త, డ్రైనేజీల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అలాగే చెత్త సేకరణ వాహనాలు క్రమం తప్పకుండా తిరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు మరమ్మతులకు గురైన చెత్త బండ్లను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని అన్ని వీధి దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని, తాగునీటి సరఫరా బోర్ల మోటార్లలో ఏర్పడిన లోపాలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. వార్డుల వారీగా సమస్యల జాబితాను అదనపు కలెక్టర్‌కు అందజేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని బీజేపీ కౌన్సిలర్లు కోరారు.

## ప్రభుత్వ సాంకేతిక విద్యను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తున్నాం



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 జనం సాక్షి :తెలంగాణ ప్రభుత్వం పాలిటెక్నిక్ డిప్లమా కాలేజీలను మరియు ఐటిఐ కాలేజీలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ లేదా శక్తి ప్రేమ్ వర్క్ కింద విలీనం చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని పి డి ఎస్ యూ నగర అధ్యక్షులు సిర్రం పవన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ నగరంలో పి డి ఎస్ యూ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ముందు విద్యార్థులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం జీవో నెంబర్ 97 ను తీసుకువచ్చి సాంకేతిక విద్యను ప్రైవేట్ పరం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని, పేద మధ్యతరగతి విద్యార్థులు సాంకేతిక విద్యకు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడుతుందని, వెంటనే ప్రభుత్వం ఇచ్చిన జీవోను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యూ నాయకులు రోహిత్, శ్రీజన్ రెడ్డి,వంశీ,శ్రీనిధి,సంకీర్తన రెడ్డి,వర్షిణి, రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

**బోయినపల్లి ఆగస్టు 18 (జనం సాక్షి)** మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మండల గౌడ సంఘం అధ్యక్షుడు స్తంభంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బోయినపల్లి సర్పంచ్ నల్లమోహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేసి, సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ త్యాగాలు, పోరాట స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. లండన్ మ్యూజియంలోనూ ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం సర్వాయి పాపన్న గౌడ్ గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తడగొండ సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్ గౌడ్, నాయకులు మెరుపుల జలంధర్, గౌడ సంఘం నాయకులు నాగుల శ్రీనివాస్, మెరుపుల గంగాధర్, విక్రుతి ఆంజనేయులు, నాగుల సాంబయ్య, బీజేపీ నాయకులు గుడి రవీందర్‌రెడ్డి, మెరుపుల అంజయ్య, పులి హనుమండ్లు, గౌడ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

### కామారెడ్డి జిల్లా సార్ రివ్యూ సమావేశానికి సర్వం సిద్ధం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (జనం సాక్షి)**కామారెడ్డి జిల్లా పరిధిలో సార్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించేందుకు జిల్లా స్థాయి సమావేశానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 19వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వీణ ఫంక్షన్ హాల్, దుబ్బలో జిల్లా సార్ రివ్యూ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి అసెంబ్లీ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ సార్ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ ఇంచార్జ్‌లు, మండల అధ్యక్షులు, పట్టణ అధ్యక్షులు, డివిజన్ అధ్యక్షులు, సంబంధిత కమిటీ సభ్యులు హాజరుకానున్నారు. జిల్లాలో సార్ ప్రక్రియ పురోగతి, చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీ శ్రేణుల సమన్వయం తదితర అంశాలపై సమావేశంలో సమీక్షించే అవకాశం ఉంది. కావున సమావేశానికి ఆహ్వానితులైన నాయకులు, కమిటీ సభ్యులందరూ ఉదయం 10 గంటలకు సమయానికి హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కామారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ కోరారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ సమావేశానికి హాజరు కావాలని ఆయన సూచించారు

## బిఆర్ఎస్ నాయకులు ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా ప్రజలను తప్పుదోవ పట్టించడం మానుకోండి

వీణవంక ఆగస్టు18(జనం సాక్షి)వీణవంక కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ పథకాలపై కోర్టులో కొనసాగుతున్న న్యాయ ప్రక్రియను తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై కుట్రగా చిత్రీకరించడం బీఆర్ఎస్ నాయకుల రాజకీయ దుష్ప్రచారం తప్ప మరొకటి కాదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎక్కటి రఘుపాల్ రెడ్డి విమర్శించారు. కోర్టులో కేసు ఉన్నప్పుడు ప్రభుత్వం న్యాయ స్థానంలో తన వాదనను సమర్థంగా వినిపించాల్సి ఉంటుందని ,అయితే న్యాయ ప్రక్రియను రాజకీయంగా వక్రీకరించి రాష్ట్ర పేద ఆడబిడ్డలను భయపెట్టడం ,ప్రజలను రెచ్చగొట్టడం మానుకోవాలని అన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ వంటి సంక్షేమ పథకాల అమలులో రాజకీయ జోక్యం,జాప్యం,చేశారని ఆరోపణలు ఉన్నాయని ఎక్కటి రఘుపాల్ రెడ్డి ఆరోపించారు. లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరిగిన పరిస్థితులు ప్రజలకు



ఇంకా గుర్తున్నాయని అన్నారు. సంక్షేమ పథకాలను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత లబ్ధిదారులకు వెంటనే చెక్కులు అందిస్తూ సంక్షేమ పథకాలను ప్రజల గడపకు చేర్చేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈ మార్పును హుజురాబాద్ నియోజకవర్గ ప్రజలు స్వయంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నాయకులకు అసహనం పేదల సంక్షేమం పేరుతో రాజకీయాలు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం కాదని,పేదల కోసం నిజాయితీగా పనిచేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని రఘుపాల్ రెడ్డి అన్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలో వొడితల ప్రణవ్ బాబు నాయకత్వంలో అభివృద్ధి కార్యక్రమాలు ముందుకు సాగుతున్నాయని తెలిపారు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ నాయకులు అసహనానికి గురవుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గేల్లు శ్రీనివాస్, మాజీ సర్పంచులు గంగాడి తిరుపతి రెడ్డి,పంజాల సతీష్ గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మినీ జాబ్ మేళాకు విశేష స్పందన

**నిజామాబాద్‌జిల్లా(ప్రతినిధిఆగస్టు18జనం సాక్షి):**స్థానిక జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, శివాజీ నగర్ నందు జరిగిన మినీ జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. ఇట్టి జాబ్ మేళాలో మూడు ప్రముఖ కంపెనీలు పాల్గొన్నాయి నిజామాబాద్ లోని స్థానిక ప్రుడెన్స్ హాస్పిటల్, అపోలో ఫార్మసీ, మహీంద్రా షోరూం లలో గల స్థానిక ఖాళీలకు ఇంటర్వ్యూలు నిర్వహించబడ్డాయి. ప్రుడెన్స్ హాస్పిటల్లో నర్సులు, రిసెప్షనిస్ట్ ఖాళీలకు, అపోలో ఫార్మసీ నందు ఫార్మసిస్ట్, అసిస్టెంట్ ఫార్మసిస్టు, అప్రెంటిస్ ఖాళీలకు, మహేంద్ర షో రూమ్ లో మేనేజర్లు, మెకానిక్ లు, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ ఖాళీలకు ఇంటర్వ్యూ నిర్వహించబడ్డాయి. ఈ మినీ జాబ్ మేళాలో 168 మంది నిరుద్యోగులు పాల్గొనగా వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి 52 మందిని వివిధ ఖాళీలకు ఎంచుకున్నారు. వారికి వెంటనే ఉద్యోగ నియామక పత్రాలు జిల్లా ఉపాధి కల్పనాధికారిణి వేల్పుల విజేత చేతుల మీదు గా అందచేశారు. వారికి జీతం 13,500 నుండి 18,000 వరకు ఇవ్వబడుతుంది. ఈ సందర్భంగా జిల్లా ఉపాధి కల్పనాధికారిణి వేల్పుల విజేత మాట్లాడుతూ స్థానిక ఖాళీలు వెతికి నిరుద్యోగ యువత కోసం స్థానిక జాబ్ మేళా ఏర్పాటు చేయబడిందని, దానిని సద్వినియోగం




చేసుకున్న యువకులకు,నిరుద్యోగులకు శు భాకాంక్షలు తెలియచేశారు. ఇకపై ప్రతినెల స్థానిక ఖాళీలతో జాబ్ మేళా నిర్వహిస్తామని ప్రకటించారు. గతంలో నిర్వహించిన విదేశీ మెగా జాబ్ మేళా నందు (4620) మంది నిరుద్యోగులు టామ్ కామ్ లో నమోదు కబడ్డారని, వారిలో మొదటి దశలో (120) మంది జర్మనీ దేశం లో ఉద్యోగాలకు ఎంపిక కాబడ్డారని తెలిపారు. వారి కొరకై వచ్చే వారంలో జర్మనీ భాష శిక్షణా తరగతులు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నామని తెలియజేశారు. అందరు నిరుద్యోగులు జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. ఇట్టి జాబ్ మేళా నందు హెచ్ఆర్ లు కిరీటి, మారుతి,జపానియా, కార్యాలయ సిబ్బంది స్వాతి, అనిత్,సందీప్, సత్యనారాయణ,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న మండల సంఘ సభ్యులు

**చొప్పదండి, ఆగస్టు 18 (జనం సాక్షి ):** గొర్ల కాపరుల సమస్యలను పరిష్కరించడానికి మండలాల పర్యటన చేస్తున్నామని కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపక దారుల సహకార సంఘం అధ్యక్షుడు బాస వేణి మల్లేశం పేర్కొన్నారు. చొప్పదండి మండలంలోని ప్రాథమిక గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం గ్రామాల అధ్యక్షులు సహకార సంఘం డైరెక్టర్ దాడి సదయ్య అధ్యక్షతన చొప్పదండి పశు వైద్య శాలలో నూతనంగా ఎన్నికైన కరీంనగర్ జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం జిల్లా యూనియన్ పాలక వర్గాన్ని ఘణంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు బాషవేణి మల్లేశం యాదవ్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో గొర్ల కాపరుల సమస్యలు తెలుసుకోవడానికి ఈ పర్యటన చేపట్టినట్లు తెలిపారు. సభ్యులు తన దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వారి సలహాలు సూచనలు స్వీకరించి తదనుగుణంగా సంఘ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. పాలక వర్గం ఏకగ్రీవానికి సహకరించిన గ్రామల అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం చొప్పదండి గ్రామ అధ్యక్షులు గుంటి మల్లన్న



ఆధ్వర్యంలో నూతన పాలకవర్గాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చిగుర్ల శ్రీనివాస్ కురుమ, డైరెక్టర్ లు అగిత రవిందర్, కాల్వ సురేష్ యాదవ్, బండి మల్లయ్య యాదవ్, చౌటపల్లి రంజిత్ యాదవ్, దాడి ఆంజనేయులు యాదవ్ అఖిల భారత యాదవ సంఘం మండల అధ్యక్షులు రాపెల్లి అయిలయ్య యాదవ్, పశు వైద్య సిబ్బంది డాక్టర్ జోష్నా రామకృష్ణ, ఏం శ్రీనివాస్, గ్రామ సహకార సంఘాల అధ్యక్షులు పానుగంటి ఆగయ్య యాదవ్, ఆవుల రాజయ్య యాదవ్ , అమరగొండ గంగయ్య కురుమ ,సందవేని,, దాడి అంజయ్య,మెండ లచ్చయ్య, దాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడిగా మామిడి రాజు ఏకగ్రీవ ఎన్నిక



**ఇల్లంతకుంట, ఆగస్టు 18 (జనంసాక్షి):**ఇల్లంతకుంట మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడిగా ఇల్లంతకుంట గ్రామ సర్పంచ్ ఎం. రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు మామిడి రాజు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మండలంలోని సర్పంచ్‌లందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.మండలంలోని సర్పంచ్‌లకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్‌లందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని సర్పంచ్ పేర్కొన్నారు.ఇట్టి కార్యక్రమంలొ సర్పంచులు నవీన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రజిత వెంకటేశం, నాయిని నవీన్, నేరళ్ళ విజయ్, చంటి, కాత మల్లేశం, రమేష్, శివాని సుమన్, కళ్యాణ్, పండుగ సునీత తిరుపతి

# చిగురుమామిడిలో ఘనంగా పాపన్న జయంతి వేడుకలు



**చిగురుమామిడి ఆగస్టు 18 (జనంసాక్షి):**అణగారిన వర్గాల తొలి ఉద్యమ నాయకుడు బహుజన రాజ్యాధికారం కోసం పోరాటం చేసిన యోధుడు,రాజరికపు వ్యవస్థకు తిరుగుబాటు చేసి బహుజన రాజ్య తొలి స్వాప్నికుడు సర్దార్ సర్వాయి పాపన్న 376వ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి పెద్ద ఎత్తున స్వీట్లను పంపిణీ చేశారు.పాపన్న ఆశయా సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పలువురు పిలుపునిచ్చారు.అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపుమేరకు పెద్ద ఎత్తున బస్సులో హైదరాబాద్ కు తరలి వెళ్లారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హుస్నాబాద్ ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అందే సురేష్,జిల్లా ఉపాధ్యక్షులు గీకురు రవీందర్,సర్పంచుల ఫోరం మండల అధ్యక్షులు మార్క రాజ్ కుమార్ గౌడ్,చిరుమామిడి సర్పంచ్ ఆకువరం భవాని,వార్డు సభ్యుడు చెరుకు చిన్నసమ్మయ్య,పూదరి వేణుగోపాల్ గౌడ్,పచ్చిమట్ల జగన్,గౌడ సంఘం మండల నాయకులు బొమ్మగాని వెంకటేశం,బొమ్మగాని పరుశురాములు,బుర్ర శ్రీనివాస్ గౌడ్,వివిధ సంఘాల నేతలు పోటు మల్లారెడ్డి,దోమ శ్రీనివాస్ రెడ్డి,ఎలగందుల లక్ష్మన్,దుల్మిట్ట నరసింహ రెడ్డి, గట్టు జనార్ధన్,గట్టు మొగిలి,గౌడ సంఘం నాయకులు ప్రజా సంగల నాయకులు,ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పండుగ సాయన్న విగ్రహం ఏర్పాటు చేయాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18( జనం సాక్షి)**బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరొందిన పండుగ సాయన్న సేవలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ముదిరాజ్ సంఘం నాయకులు పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలన, భూస్వాములు, పెత్తందారుల ఆధిపత్యం కొనసాగిన కాలంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి పండుగ సాయన్న పాటుపడ్డారని తెలిపారు.కులమతాలకు అతీతంగా పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలు జరిపించి, ప్రతి కుటుంబానికి పెద్దన్నగా అండగా నిలిచిన మహోన్నత వ్యక్తి పండుగ సాయన్న అని కొనియాడారు. కేవలం 36 ఏళ్ల జీవిత కాలంలోనే బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన వీరుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు.పండుగ సాయన్నను అణిచివేసేందుకు భూస్వాములు కుట్రలు చేసినప్పటికీ, ఆయనకు ప్రజల నుంచి లభించిన అపారమైన మద్దతు సామాజిక చైతన్యానికి నిదర్శనమని అన్నారు. అలాంటి గొప్ప వ్యక్తి చరిత్ర, సేవలు, పోరాట స్ఫూర్తి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలవాలంటే జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అవసరమని తెలిపారు.రాష్ట్రంలో, జిల్లాలో గణనీయమైన జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గం ఆత్మగౌరవానికి ప్రతీకగా జిల్లా కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వినతిపత్రం సమర్పించినట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, పున్న రాజేశ్వర్, నీల నాగరాజు, గజ్జెల బిక్షపతి, నంద రమేష్, గేరిగంటి లక్ష్మీనారాయణ, సునుగూరి బానుప్రకాష్, దాకి అరవింద్, కాళ్ల గంగారాజు, పిల్లి మల్లేష్, చింతల రమేష్, మోడేగామ్ మహేష్, బట్టు నర్సింలు, ప్రసాద్, బర్ల స్వామి, కనికంటి రమేష్, నర్సింలు, చిట్యాల రమేష్, పిట్ల శంకర్, నర్సులు, స్వామి, అంజి, శ్రీకాంత్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# మూడో రోజుకు చేరిన జర్నలిస్టుల నిరాహార దీక్షలు



హుజురాబాద్, ఆగస్టు 18 (జనం సాక్షి):ప్రభుత్వమే స్వయంగా పట్టాలు ఇచ్చి, సర్వే నంబర్లు కేటాయించి, ఇంటి నంబర్లు సైతం మంజూరు చేసిన జర్నలిస్టుల నివేశన స్థలాలపై అక్రమ కేసులు పెట్టి వారిని రోడ్డుపైకి లాగడం కాంగ్రెస్ నాయకులు, రెవెన్యూ అధికారుల తీవ్ర నిర్లక్ష్యానికి, అసమర్థతకు పరాకాష్ట అని సీపీఐ సీనియర్ నాయకులు మర్రి వెంకటస్వామి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జర్నలిస్టుల సమస్యను పరిష్కరించకుండా అధికార యంత్రాంగం కాలయాపన చేస్తే సహించేది లేదని, అవసరమైతే ప్రజా సంఘాలు, అఖిలపక్ష పార్టీలను కలుపుకుని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.కాంగ్రెస్ నాయకుడు గూడూరు స్వామిరెడ్డి జర్నలిస్టుల నివేశన స్థలాలపై అక్రమంగా కేసులు నమోదు చేయించడాన్ని నిరసిస్తూ హుజూరాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో పాత్రికేయులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సందర్శించిన సిపిఐ సీనియర్ నాయకులు మర్రి వెంకటస్వామి జర్నలిస్టులకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించి మాట్లాడారు.పట్టాలు ఇచ్చింది ప్రభుత్వమే.. రక్షించాల్సింది కూడా ప్రభుత్వమే ఉపఎన్నికల సమయంలో అప్పటి కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ తదితర అధికారుల సమక్షంలో ఇంటి నంబర్లు కేటాయించి, చట్టబద్ధంగా 120 గజాల స్థలాలకు పట్టాలు అందజేశారని వెంకటస్వామి గుర్తుచేశారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాల ఆధారంగా జర్నలిస్టులు అప్పులు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని, అందరికీ ఇంటి నంబర్లు సైతం మంజూరయ్యాయని తెలిపారు. ప్రభుత్వ రికార్డుల్లో స్పష్టంగా ఉన్న భూమి విషయంలో అధికారులు వాస్తవాలను న్యాయస్థానం ముందుంచి సమస్యను పరిష్కరించాల్సింది పోయి, కోర్టు పేరుతో చేతులు దులుపుకోవడం దారుణమన్నారు.హుజురాబాద్ జర్నలిస్టులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు జమ్మికుంట ప్రెస్ క్లబ్ జర్నలిస్టులు పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత కొన్నేళ్లుగా హుజురాబాద్ జర్నలిస్టులు ఎదురుచూస్తున్న నివేషణ స్థలాలను పొందినప్పటికీ వాటిపై కాంగ్రెస్ నాయకుడు స్వామి రెడ్డి కేసు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట జర్నలిస్టులు నసిరుద్దీతదితరులు పాల్గొన్నారు.

# మహిళా శిశు సంక్షేమ శాఖలో 25 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ సభ్యత్వ నమోదు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (జనం సాక్షి )కామారెడ్డి జిల్లా జేఏసీ కమిటీ ఆధ్వర్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన 25 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు జేఏసీ సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, జిల్లా జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ అల్లావుద్దీన్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణ్ కుమార్, జిల్లా జేఏసీ అధ్యక్షులు మహమ్మద్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, ఉద్యోగ భద్రత కోసం జేఏసీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం ఐక్యంగా కృషి చేస్తామని పేర్కొన్నారు.అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ జేఏసీతో కలిసి ముందుకు సాగాలని, తమ హక్కుల సాధన కోసం ఐక్యతతో ఉండాలని నాయకులు పిలుపునిచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని అన్నారు. జిల్లాలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను సంఘటితం చేసి జేఏసీని మరింత బలోపేతం చేస్తామని తెలిపారు సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఉద్యోగుల నుంచి మంచి స్పందన లభించిందని, రానున్న రోజుల్లో మరిన్ని శాఖల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా జనరల్ సెక్రెటరీ రాజేందర్, జిల్లా ఉపాధ్యక్షులు ఇక్రమ్, మునీర్, అనిత, జేఏసీ నాయకులు హరీష్, మహేష్, నాగేష్, అరుణ్, రాము, నరేష్, సౌందర్య, స్రవంతి తదితర జేఏసీ నాయకులు, మహిళా శిశు సంక్షేమ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఆదర్శ పాఠశాల వసతిగృహంలో ఎంపీడీవో ఆకస్మిక తనిఖీ

**సిరికొండ ఆగస్టు 18(జనం సాక్షి ):** సిరికొండ మండల కేంద్రంలోని పీఎం శ్రీ తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల మరియు వసతిగృహాన్ని ఎంపీడీవో మహమ్మద్ రఫీ అహ్మద్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతిగృహ పరిసరాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, భోజన వసతులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. పరిసరాల్లోని పిచ్చి మొక్కలను తొలగించి పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. కేర్‌టేకర్ విద్యార్థుల పట్ల చూపుతున్న శ్రద్ధ, బాధ్యతాయుతమైన నిర్వహణను ఎంపీడీవో అభినందించారు. అనంతరం పాఠశాలలో



విద్యార్థుల నమోదు, తరగతుల వారీగా విద్యార్థుల సంఖ్య, హాజరు వివరాలను ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు పాఠశాలలో అందుబాటులో ఉన్న విద్యా సౌకర్యాలను తల్లిదండ్రులకు, విద్యార్థులకు విస్తృతంగా తెలియజేయాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, భోజన తయారీ విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యకరమైన ఆహారం, సురక్షితమైన వాతావరణం కల్పించడం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గడ్డం రాజేష్ రెడ్డి పాల్గొన్నారు. ఎంపీడీవో చేసిన సూచనలను తప్పనిసరిగా అమలు చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

# ఎస్ఆర్ఆర్‌లో ఘనంగా ఎం.కాం విద్యార్థుల అబ్షీడ్ ఫీస్టా వీడ్కోలు వేడుకలు

**కరీంనగర్ టౌన్ ఆగస్టు 18 ( జనం సాక్షి)**ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని, సమయపాలన పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా నిరంతరం శ్రమించి, సానుకూల దృక్పథంతో ముందుకు సాగితే ఎం.కాం విద్యార్థులు జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ అన్నారు.స్థానిక ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో ఎం.కాం విద్యార్థులు 'అబ్షీడ్ ఫీస్టా' పేరుతో ఏర్పాటు చేసిన వీడ్కోలు వేడుకలను ప్రిన్సిపల్ ఆచార్య కల్వకుంట రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం.కాం విద్యార్థులకు విస్తృతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థులు విషయ పరిజ్ఞానంతో పాటు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకొని, పోటీ ప్రపంచంలో రాణించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని సూచించారు.కామర్స్ విభాగాధిపతి టి. రాజయ్య మాట్లాడుతూ విద్యార్థులు మంచి విషయ పరిజ్ఞానంతో పాటు వృత్తి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని అన్నారు. వ్యాపార,



వాణిజ్య, పారిశ్రామిక, బ్యాంకింగ్, బీమా తదితర సేవా రంగాల్లో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. విద్యార్థులు నృత్యాలు, పాటలు, స్కిట్లు, ర్యాంప్‌వాక్‌లతో సందడి చేశారు. వీడ్కోలు వేడుకలు ఆహ్లాదకర వాతావరణంలో ఉత్సాహంగా సాగాయి.కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ పి. నితిన్, కామర్స్ విభాగాధిపతి టి. రాజయ్య, అటానమస్ సమన్వయకర్త, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ ఎం. శ్రీనివాసరెడ్డి, ఐక్యూఏసీ సమన్వయకర్త డాక్టర్ హర్ జ్యోత్ కౌర్, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ బోర్ల నరేష్, అధ్యాపకులు డాక్టర్ ఎం. మల్లారెడ్డి, డాక్టర్ ఆర్. రామకృష్ణ, డాక్టర్ అర్జున్, ఎం. శిరీష, అరవింద్, నర్మద, ఐలయ్య, మల్లేశం, పూర్ణచందర్, బి. గౌతమి, రాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలు ఘనంగా

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 18 ( జనం సాక్షి)**లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్, జిల్లా 320జీ, ప్రాంతం--2, మండలం--2 ఆధ్వర్యంలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకలను కరీంనగర్ గణేష్‌నగర్ మెయిన్‌రోడ్‌లోని అదితి బాంకెట్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన ఫోటోగ్రాఫర్లు, ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. దివంగత లయన్ మైదం సత్యనారాయణ 25 సంవత్సరాల క్రితం ప్రారంభించిన ఫోటోగ్రాఫర్ల సత్కార సంప్రదాయం ఈ ఏడాదితో 25 సంవత్సరాలు పూర్తిచేసుకుంది. 2001 ఆగస్టు 19న కరీంనగర్‌లోని హోటల్ నీలగిరిలో ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ఫోటోగ్రాఫర్లను సత్కరించడంతో ఈ సంప్రదాయం ప్రారంభమైంది. 25 ఏళ్ల అనంతరం కూడా అదే స్ఫూర్తితో ఫోటోగ్రఫీ రంగానికి చెందిన వారిని సత్కరించడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారులను వారి సేవలు, వృత్తిపట్ల అంకితభావం, ఫోటోగ్రఫీ రంగానికి అందిస్తున్న సేవలను గుర్తిస్తూ సన్మానించారు. అలాగే నాలుగు జిల్లాలకు చెందిన ఫోటోగ్రాఫర్లను వారి సృజనాత్మకత, ప్రతిభ, అంకితభావాన్ని




అభినందిస్తూ ఘనంగా సత్కరించారు. సమాజంలోని ముఖ్య సంఘటనలను చిత్రాల రూపంలో భద్రపరుస్తూ ప్రజలకు అందిస్తున్న సేవలను నిర్వాహకులు కొనియాడారు.ఈ కార్యక్రమానికి సాగర్ ల్యాబ్ ఉదారంగా సహకరించింది. 25 ఏళ్లుగా కొనసాగుతున్న ఫోటోగ్రాఫర్ల సత్కార సంప్రదాయానికి సహకరిస్తున్న సాగర్ ల్యాబ్‌కు లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. వీకార్యక్రమానికి ముఖ్య అతిథిగా కరీంనగర్ అదనపు డీసీపీ (శాంతిభద్రతలు) శ్రీ పి. వెంకట రమణ హాజరయ్యారు. గౌరవ అతిథులుగా టీజీపీడబ్ల్యూవీఏ జనరల్ సెక్రటరీ శ్రీ సిరి రవి, చీఫ్ అడ్వైజర్ శ్రీ మహిమల క్యాదన్ రెడ్డి పాల్గొన్నారు.కార్యక్రమానికి లయన్ బొమ్మ పవన్ కుమార్ ఎంఎఫ్‌జే, పీఆర్‌సీ, పీడీసీఎస్, ఐ హాస్పిటల్ ట్రస్టీ చైర్మన్‌గా వ్యవహరించారు.లయన్ బట్టు వినోద్ ఎంఎఫ్‌జే కార్యదర్శి, లయన్ మేతుకు కె. చైతన్య ఎంఎఫ్‌జే కోశాధికారితో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా దివంగత లయన్ మైదం సత్యనారాయణ సేవా దృక్పథాన్ని, దూరదృష్టిని నిర్వాహకులు స్మరించుకున్నారు. 2001లో ఆయన ప్రారంభించిన ఫోటోగ్రాఫర్ల సత్కార కార్యక్రమం నేటికీ కొనసాగుతూ 25 సంవత్సరాలు పూర్తిచేసుకోవడం లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్‌కు గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని విజయ వంతం చేయడానికి సహకరించిన సాగర్ ల్యాబ్,ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, కరీంనగర్, జగిత్యాల, రాజన్న-సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల నుంచి హాజరైన ఫోటోగ్రాఫర్లకు లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ కృతజ్ఞతలు తెలిపింది.

## హున్స లో ప్రారంభమైన వారంతపు సంత



**బోధన్, ఆగస్టు 18 ( జనంసాక్షి ) :** సాలూర మండలం హున్స గ్రామంలో మంగళవారం సర్పంచ్ మర్కల్ శివ కుమార్, ఉప సర్పంచ్ తుడిమె సగేష్, పాలక వర్గం ఆధ్వర్యంలో వారంతపు సంతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ మంగళవారం గ్రామంలో నిర్వహించే సంతను గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి హానికరమైన రసాయనాలు కాకుండా మంచి కూరగాయలను అందించే అవకాశం ఉందని అందువల్ల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మర్కల్ శివ కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శివ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ చీల శంకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ పంచాయతీ వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు కొరకు కౌన్సిలింగ్



**రామగిరి జనం సాక్షి 18 :రామగుండం-3** ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ఆదేశాల మేరకు రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు ఏరియాలలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు సెంటినరీ కాలనీలో గల క్వార్టర్ల కేటాయింపు కొరకు మంగళవారం నాడు సెక్యూరిటీ కార్యాలయ ఆవరణలో క్వార్టర్ల కేటాయింపు కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగింది. మొత్తము 239 ఖాళీ క్వార్టర్లు ఉండగా, మెడికల్, ఫ్రెష్ అలాట్మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కొరకు 204 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకోగా, 55 మంది ఉద్యోగులు హాజరై, 44 మంది క్వార్టర్లను ఎంపిక చేసుకున్నారు. వారికి త్వరలోనే క్వార్టర్ల కేటాయింపు పత్రాలు ఇస్తామని ఎస్వోటుజియం యం. రామ్మోహన్, తెలియజేశారు.ఈకార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, కోట రవీందర్ రెడ్డి, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, సివిల్ విభాగం అధికారి మనోజ్, ఎస్టేట్స్ విభాగం అధికారిని శ్యామల, డివై పియం ఎన్.వంశీధర్, క్వార్టర్ల విభాగం సిబ్బంది రమ్య రెడ్డి, దాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి అవార్డులకు ఎంపికైన కరీంనగర్ ముద్దుబిడ్డ మైమాల కేదార్ రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 18 (జనంసాక్షి) :** ప్రతి సంవత్సరం కలకత్తా వారు నిర్వహించే మూడవ వైట్ నేషనల్ సెలూన్ ఫోటోగ్రఫీ కాంపిటేషన్లలో జాతీయ స్థాయిలో ఫోటో జర్నలిజం విభాగంలో సిగ్మా ఫోటో స్టూడియో నిర్వాహకులు మహిమాల కేదార్ రెడ్డి కి జ్యూరీ ఛాయిస్ అవార్డు లభించినది. అలాగే వరల్డ్ ఇన్ ఫోకస్ విభాగంలో సర్ట్యూట్స్ మెడల్ అండ్ జ్యూరీ ఛాయిస్ అవార్డులు 2026 సెప్టెంబర్ నెల లో అందుకోనున్నారు. ఈ అవార్డు వచ్చినందుకు తెలంగాణ రాష్ట్ర ఫోటో, అండ్ వీడియో గ్రాఫర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు, పట్టణ, జిల్లా నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నోటుబుక్స్ పంపిణీ



**మల్లాపూర్ ఆగస్టు18 (జనంసాక్షి)** ప్రభుత్వ జూనియర్ కళాశాల మల్లాపూర్ నందు విద్యార్థులకు నోటుబుక్కులు పంపిణీ చేయడం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థికి ఉచిత పాఠ్యపుస్తకాలు మరియు నోట్బుక్కులు, యూనిఫామ్, మరియు షూస్, ఉచిత భోజనం. ఇందులో భాగంగా మంగళవారం రోజు ప్రతి విద్యార్థికి 12 నోటు బుక్స్ అందించడం జరిగింది. వీటి విలువ సుమారు 650 రూపాయలు. ఇంతకుముందు ఉచిత పాఠ్యపుస్తకాలు ప్రతి విద్యార్థికి అందించిన విషయం విధితమే మధ్యతరగతి మరియు బీద తల్లిదండ్రులైన పిల్లలకు ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం ఉచిత పాఠ్య పుస్తకాలను ఉచిత నోట్ బుక్కులను పంపిణీ చేయడం జరుగుతుంది. రానున్న రెండు మూడు రోజుల్లో ప్రతి విద్యార్థికి కాలేజ్ బ్యాక్ మరియు షూస్ అందించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బండి సత్యనారాయణ మరియు అధ్యాపకులు నంచర్ల రాజేష్, సంతోష్, శ్రీనివాస్ మహేష్, రాజేందర్, రజిత తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు భూసార పరీక్షల పై శిక్షణ ఇస్తున్న అధికారులు



చొప్పదండి, ఆగస్టు 18( జనం సాక్షి): మండలంలోనిరుక్మాపూర్ తెలంగాణ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు భూసార పరీక్ష కేంద్రం కరీంనగర్ వ్యవసాయ అధికారి ,చొప్పదండి మండల వ్యవసాయ అధికారి మమత గారు విద్యార్థులకు సాయిల్ హెల్త్ ఫెర్టిలిటీ అండర్ పిఎం ఆర్ కే వి వై పథకంలో భాగంగా భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు . ఇందులో భాగంగా రుక్మాపూర్ క్లస్టర్ పరిధిలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు భూసార పరీక్షలు నేల ఆరోగ్యం సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు భూసార నమూనా సేకరణ, భూసార పరీక్ష విధానం, ఫలితాల ప్రాముఖ్యత ,భూసార కార్డుల ఆధారంగా ఎరువుల వినియోగంపై ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి అనూష , స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్ , సైన్స్ టీచర్ మంజూరు అహ్మద్ రుక్మాపూర్ గ్రామ సర్పంచ్ ప్రేమలత - శ్రీనివాస్ , 8, 9వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు .

### మల్లాపూర్ లో సర్దార్ సర్వాయి పాపన్న జన్మదిన వేడుకలు

**మల్లాపూర్ ఆగస్టు18 (జనం సాక్షి)**మల్లాపూర్ మండల కేంద్రంలో ఘనంగా మల్లాపూర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షులు ముద్దం శరత్ గౌడ్ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సంఘం మండల అధ్యక్షులు బండి లింగస్వామి గౌడ్ ముధం సత్యనారాయణ గౌడ్ , పెరుమండ్ల అర్జున్ గొట్టి పడత సత్యం ఆలాల నరసయ్య గొట్టిపడుత లక్ష్మీరాజం పెరుమాండ్ల నవీన్ నాగుల నారాయణ బండి సత్యం ముద్దం శ్రీధర్ సతీష్ నవీన్ అజయ్ అనిల్ రవి రమేష్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ చేసిన నాయకుల





**బోధన్, ఆగస్టు 18 ( జనంసాక్షి ) :** తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం విద్యార్థులకు వరంగా మారింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం మున్సిపల్ చైర్మన్ తూము పద్మ శరత్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నిక్కత్ కౌసర్ మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న నోట్‌బుక్స్ పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ప్రభుత్వం అందిస్తున్న ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ తూము పద్మ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బోధన్ పట్టణ పార్టీ అధ్యక్షులు అంకు దాము మాట్లాడుతూ, కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ పట్టణ మాజీ అధ్యక్షులు పాషా, వార్డు కౌన్సిలర్ తూము శరత్ రెడ్డి, మైనారిటీ ప్రెసిడెంట్ ఎస్.కె. కలీమ్, మదుమాలంచ కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్, కౌన్సిలర్లు ఆది నారాయణ, మిద్దెల దివ్య, చిరంజీవి, పెద్దపల్లి శ్రీను, లైబ్రేరియన్ సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగులను సన్మానించిన ప్రైవేట్ పాఠశాలల మరియు కళాశాలల అసోసియేషన్




**బోధన్, ఆగస్టు 18 ( జనంసాక్షి ) :** ప్రైవేట్ పాఠశాలల మరియు కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో, స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఉత్తమ ఉద్యోగులుగా అవార్డు అందుకున్న బోధన్ మండల తహసీల్దార్ విఠల్, బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ వెంకట్ నారాయణలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ట్రస్మా అధ్యక్షులు కొడాలి కిషోర్ మాట్లాడుతూ, కింది స్థాయి నుంచి ఆఫీసర్ స్థాయికి ఎదిగి, ప్రత్యక్షంగా ప్రజలతో మమేకమవుతూ, వాళ్ళ వృత్తి ధర్మాన్ని ఎంతో గొప్పగా నిర్వహించే ఆఫీసర్లు ఇక్కడ ఉండడం మాకు చాలా గర్వకారణం. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా అందుకోవడం చాలా సంతోషం. మరియు బోధన్ నియోజకవర్గ అభివృద్ధిలో మీ ఇద్దరి పాత్ర చాలా ముఖ్య మైనదని కొనియాడారు. గత సంవత్సరం అధిక వర్షాల వల్ల హంగర్గ గ్రామం మునిగిపోవడం అప్పుడు తహసీల్దార్ విఠల్ చేసినటువంటి కృషి, మరియు అందరిని సమన్వయం చేసుకోవడం, ప్రజలకు అధికారులకు, నాయకులకు వారధిగా నిలవడం అభినందనీయమన్నారు. పట్టణ సీఐగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి అన్ని పాఠశాలల్లో కళాశాలలో షీ టీమ్స్ ద్వారా గాని,బి వారు స్వయంగా ఎన్నో కార్యక్రమాలు పాఠశాలలో మరియు కళాశాలలో నిర్వహించి విద్యార్థులకు సూచనలు చేయడం, నేటి కాలంలో యువత మత్తుకు బానిస కాకుండా ఆంటీ డ్రగ్స్ కార్యక్రమాలు నిర్వహించడంలో వెంకట నారాయణ పాత్ర చాలా పెద్దదన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య, మరియు ట్రస్మ జిల్లా అధ్యక్షులు కొడాలి కిషోర్, వివిధ పాఠశాలల కళాశాలల డైరెక్టర్స్ హరికృష్ణ, శ్రీనివాస్ , జయప్రకాష్, చక్రవర్తి, మిద్దెల రాజు, కృష్ణ మోహన్, సురేష్ , దుష్యంత్, గుర్రం సంతోష్ పాల్గొన్నారు.

## విద్యుత్ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి




**కరీంనగర్ టౌన్, ఆగస్టు 18, ( జనం సాక్షి)**తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఉద్యోగులపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించడంతో పాటు ప్రైవేటీకరణ చర్యలను నిలిపివేయాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (రిజిస్టర్ నం. హెచ్-1829, సీఐటీయూ అనుబంధం) డిమాండ్ చేసింది. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగులు తీవ్ర ఒత్తిడి, అభద్రత మధ్య విధులు నిర్వహిస్తున్నారని యూనియన్ ఆందోళన వ్యక్తం చేసింది. విద్యుత్ వినియోగదారుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ అందుకు అనుగుణంగా ఉద్యోగుల సంఖ్య పెరగకపోవడంతో పనిభారం విపరీతంగా పెరిగిందని పేర్కొంది. ఉద్యోగుల సంఖ్య తగ్గినా.. వినియోగదారులు పెరిగారు2014లో రాష్ట్రంలో సుమారు కోటి 25 లక్షల విద్యుత్ సర్వీసులు ఉండగా, దాదాపు 60 వేల మంది ఉద్యోగులు పనిచేసేవారని యూనియన్ తెలిపింది. 2026 నాటికి విద్యుత్ వినియోగదారుల సంఖ్య కోటి 90 లక్షలకు పెరిగినా ఉద్యోగుల సంఖ్య మాత్రం 51 వేలకు తగ్గిందని పేర్కొంది. ప్రతినెలా ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్నప్పటికీ ఖాళీ పోస్టులను భర్తీ చేయడం లేదని తెలిపింది. దీంతో ఫీల్డ్ సిబ్బంది నుంచి ఇంజనీర్ల వరకు అదనపు గంటలు పనిచేయాల్సి వస్తోందని, కుటుంబంతో గడపాల్సిన సమయం కూడా విధులకు కేటాయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసింది. 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో నలుగురు సిబ్బంది పనిచేయాల్సి ఉండగా కొన్ని ప్రాంతాల్లో ఇద్దరు, మరికొన్ని చోట్ల ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని యూనియన్ తెలిపింది. సిబ్బంది కొరత, పెరుగుతున్న పనిభారం, విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలనే ఒత్తిడి కారణంగా ప్రమాదాల ముప్పు పెరుగుతోందని పేర్కొంది. ప్రమాదాల నివారణకు సంస్థలు మరింత పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేసింది. వెంటనే పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేసి వేతన సవరణ ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేసింది. 10 రోజుల సమ్మె చేసిన ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, అన్మెన్డ్ కార్మికులను విద్యుత్ సంస్థల్లో విలీనం చేయాలని కోరింది..విద్యుత్ సంస్థలను, ఉద్యోగుల హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు ఐక్యంగా పోరాటాలు చేపట్టాలని యూనియన్ పిలుపునిచ్చింది. సంస్థల బలోపేతంతో పాటు వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు అవసరమైన సిబ్బంది నియామకాలు చేపట్టాలని కోరింది.

# సింగరేణి పాఠశాలలో ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ ఆకస్మిక తనిఖీ



**8వ కాలనీ (జనంసాక్షి), ఆగస్టు 18:** సింగరేణి సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ జ్యోతి బుద్ధ ప్రకాశ్, ఐఏఎస్, డైరెక్టర్ (పీఏ) శ్రీ గౌతమ్ పొట్రు, ఐఏఎస్‌ల మార్గదర్శకంలో సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీగా బాధ్యతలు చేపట్టిన శ్రీ జి. రాజేంద్రప్రసాద్ సింగరేణి పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు.అందులో భాగంగా మంగళవారం 18-08-2026న స్థానిక సింగరేణి పాఠశాల (సీబీఎస్ఈ)ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల కరెస్పాండెంట్ శ్రీ ఎన్. వేణుగోపాల్‌తో కలిసి పాఠశాల పరిసరాలను పరిశీలించారు.పాఠశాలలోని సమస్యలను గుర్తించి, సంబంధిత స్థానిక విభాగాల అధికారులకు వివరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పాఠశాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, విద్యార్థులకు అవసరమైన కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు.అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. సింగరేణి యాజమాన్యం ఎంతో ప్రతిష్టాత్మకంగా సీబీఎస్ఈ పాఠశాలను ఏర్పాటు చేసిందని, పాఠశాలలో గుర్తించిన చిన్నచిన్న సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. పాఠశాల సక్రమంగా నిర్వహించేందుకు తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని అన్నారు.తర్వాత ఉపాధ్యాయులతో మాట్లాడుతూ బోధనలో నూతన సాంకేతికతను వినియోగించాలని, విద్యార్థుల అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.పాఠశాల కరెస్పాండెంట్ శ్రీ ఎన్. వేణుగోపాల్ మాట్లాడుతూ పాఠశాలలోని సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను



కోరారు.ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ శ్రీ జి. రాజేంద్రప్రసాద్, కరెస్పాండెంట్ శ్రీ ఎన్. వేణుగోపాల్, హెడ్‌మిస్ట్రెస్ శ్రీమతి స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు

# ఎంపీడీవో కార్యాలయం పక్కన నిరుపయోగంగా ఉన్న వైకుంఠ రథం



**జమ్మికుంట, ఆగస్టు 18 (జనం సాక్షి):** ఎంపీడీవో కార్యాలయం పక్కన కొన్ని సంవత్సరాలుగా వైకుంఠ రథాన్ని నిరుపయోగంగా ఉంచడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని వెంకటేశ్వర్ల పల్లి మూడవ వార్డు సభ్యుడు బండారు ప్రశాంత్ అన్నారు. ఈ సందర్భంగా బండారు ప్రశాంత్ మాట్లాడుతూ ప్రజలకు అత్యవసర సమయంలో ఉపయోగపడాల్సిన వైకుంఠ రథం ఇంతకాలం పక్కన పెట్టడం సరికాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు.వైకుంఠ రథాన్ని సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి కుటుంబాలకు అంత్యక్రియల సమయంలో వైకుంఠ రథం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అందువల్ల దాన్ని నిరుపయోగంగా ఉంచకుండా ప్రజా సేవకు వినియోగించాలని కోరుతున్నామన్నారు.అధికారులు వెంటనే స్పందించి వైకుంఠ రథాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఆయన కోరారు.

# రాజీవ్ యువ వికాస్ అమలు చేయాల్సిందే



**ముస్తాబాద్రా ఆగస్టు 18 (జనం సాక్షి):** జీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ యువతను మోసపుచ్చుతోందని బీఆర్ఎస్ యూత్ నాయకుడు నవీన్ రెడ్డి మండిపడ్డారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహానికి వినూత్న రీతిలో వినతి పత్రం అందజేస్తూ బీఆర్ఎస్ యువజన నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు పలు డిమాండ్లు చేస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు..రాజీవ్ గాంధీ జయంతి సద్భావన దినోత్సవం రోజున యువ వికాస్ పథకాన్ని అమలు చేసిన తర్వాతే నివాళులు అర్పించాలని, లేనియెడల తెలంగాణ యువతకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు..సుమారు 16 లక్షల దరఖాస్తులు రాగా, వాటిలో 10 లక్షలు అర్హత సాధించినట్లు గుర్తించిన ప్రభుత్వం ఒక్కరికి కూడా లబ్ధి చేకూర్చకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాస్ట్, ఇన్కమ్, రెసిడెన్సీ ఇతర ధృవీకరణ పత్రాల జిరాక్స్‌ల పేరుతో దరఖాస్తు చేసుకున్న యువత జేబుల నుండి సుమారు 50 కోట్లు నష్టం చేశారని విమర్శించారు. 2025 మార్చి నెలలో దరఖాస్తులు ప్రారంభించి నెల రోజుల పాటు స్వీకరించి, ఎంపీడీఓ మరియు బ్యాంకు అధికారుల సమయాన్ని వృథా చేశారని మండిపడ్డారు. 2026-27 బడ్జెట్‌లో రాజీవ్ యువ వికాస్ కోసం 5800 కోట్లు కేటాయించినట్లు చెప్పి, ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ఎస్టీ యువతకు 1300 కోట్లు, ఎస్సీ యువతకు 2000 కోట్లు కేటాయించి బడ్జెట్‌లో వారిని నట్టేట ముంచారని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అమలు చేయకుండా నివాళులు అర్పించడం కాంగ్రెస్ నిస్సిగ్గుతనానికి నిదర్శనమని నిలదీశారు.రానున్న రోజుల్లో యువతకు జరిగిన అన్యాయాన్ని, కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీల మానిఫెస్టోను ఇంటింటికీ వెళ్లి ఎవరిని వదిలిపెట్టకుండా బీఆర్ఎస్ యువత నిలదీస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేరళ్ళ అనిల్ గౌడ్, ఎగుర్ల కనకరాజు, అంకారాపు మహేందర్, నమిలికొండ అనిల్, గోడిసేలా బాబు, మామిడాల విజయ్, మామిడాల ఉమశంకర్, గుర్రం శ్రీకాంత్, రడం అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న మనాలి ఠాకూర్



**గోదావరిఖని, ఆగస్టు 18 (జనం సాక్షి):** :రామగుండం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్ మంగళవారం సుందిళ్ల గ్రామంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, రామగుండం నియోజకవర్గం సుభిక్షంగా, సుఖసంతోషాలతో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఆలయ అర్చకులు మనాలి ఠాకూర్ కు ఘనంగా స్వాగతం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వాడల్లో చెట్లు పిచ్చి మొక్కలతో ఇబ్బందులు



**8వ కాలనీ (జనంసాక్షి), ఆగస్టు 18**: కార్మిక క్వార్టర్స్ (టీ-2) మధ్యలోని ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కల కారణంగా కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దట్టంగా పెరిగిన పిచ్చిమొక్కలతో పాములు, విషపూరిత కీటకాలు ఇళ్ల పరిసరాల్లోకి వస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.ఈ సమస్యను 18వ డివిజన్ కార్పొరేటర్ దేవనపల్లి చక్రపాణి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పందించారు. కార్మిక కుటుంబాల భద్రతను దృష్టిలో ఉంచుకుని సింగరేణి అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు.దీంతో సింగరేణి సివిల్ సిబ్బంది టీ-2 క్వార్టర్స్ మధ్యలోని ఖాళీ స్థలంలో పెరిగిన చెట్లు, పిచ్చిమొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.సమస్యపై తక్షణమే స్పందించి పరిష్కరించిన కార్పొరేటర్ దేవనపల్లి చక్రపాణికి, సింగరేణి అధికారులకు కార్మిక కుటుంబాలు కృతజ్ఞతలు తెలిపారు.



## సుందిళ్ల దేవాలయానికి రూ.9,43,621 హుండీ ఆదాయం



**8వ కాలనీ (జనంసాక్షి), ఆగస్టు 18:** రామగిరి మండలంలోని సుప్రసిద్ధ సుందిళ్ల శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి సన్నిధిలో జరిగిన ఈ లెక్కింపులో మొత్తం రూ.9,43,621 ఆదాయం లభించినట్లు దేవస్థాన చైర్మన్ కోర్కొప్పుల సత్యనారాయణ గౌడ్, ఈవో రాజకుమార్ తెలిపారు.వివిధ ప్రాంతాల నుంచి భక్తుల రాక పెరుగుతుండటంతో దేవస్థాన హుండీ ఆదాయం కూడా పెరుగుతోందని అధికారులు, పాలకవర్గం తెలిపారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డివిజన్ దేవాదాయ శాఖ పరిశీలకులు ఆర్. ప్రవీణ్, దేవస్థాన చైర్మన్ కోర్కొప్పుల సత్యనారాయణ గౌడ్, ధర్మకర్తల మండలి సభ్యులు రేకుంట్ల రవి, శ్రీనివాసరావు, సమ్మయ్య, జనగామ హేమలత, అర్చకులు రుద్రపట్ల జయంతి శర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీ రాజరాజేశ్వర సేవాసమితి సభ్యులు కూడా హుండీ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# విజయవంతంగా మోకాలు మార్పిడి శస్త్రచికిత్స

గోదావరిఖని, జనంసాక్షి :రామగుండంలోని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆర్థోపెడిక్స్ విభాగం అవుట్‌పేషెంట్ విభాగానికి 70 ఏళ్ల మహిళ గత రెండేళ్లుగా ఎడమ మోకాలిలో నిరంతర నొప్పి, నడవడంలో ఇబ్బందితో వచ్చారు. కాలక్రమేణా ఆమె సమస్య తీవ్రతరం కావడంతో రోజువారీ కార్యకలాపాలు, కదలికలు గణనీయంగా ప్రభావితమయ్యాయి.వైద్య పరీక్షల్లో ఎడమ మోకాలిలో గణనీయమైన వైకల్యంతో పాటు కదలికలు పరిమితంగా, నొప్పితో ఉన్నట్లు గుర్తించారు. ఎక్స్‌రే పరీక్షల్లో మోకాలి కీలులో తీవ్ర ఆర్థరైటిస్ మార్పులు, కీళ్ల మధ్య ఖాళీ గణనీయంగా తగ్గడం, క్షీణతకు సంబంధించిన మార్పులు, మోకాలి ఆకృతిలో వైకల్యం ఉన్నట్లు నిర్ధారణ అయింది.రోగి లక్షణాల తీవ్రత, నడకలో మరియు రోజువారీ కార్యకలాపాల్లో ఏర్పడిన ఇబ్బందులు, మోకాలి కీలులో ఉన్న తీవ్రమైన క్షీణతను పరిగణనలోకి తీసుకుని అందుబాటులో ఉన్న చికిత్సా విధానాల గురించి రోగికి వివరించారు. వ్యాధి తీవ్రతతో పాటు జీవన నాణ్యతపై పడుతున్న ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో మోకాలు మార్పిడి శస్త్రచికిత్స చేయాలని నిర్ణయించారు. శస్త్రచికిత్స విధానం, దాని వల్ల కలిగే ప్రయోజనాలు, సంభావ్య ప్రమాదాలు, శస్త్రచికిత్స అనంతర పునరావాసం గురించి రోగికి వివరించి, ఆమె సమ్మతి పొందారు. 2026 ఆగస్టు 12న డాక్టర్ ప్రదీప్ చంద్ర, ప్రొఫెసర్, ఆర్థోపెడిక్స్ విభాగాధిపతి



నాయకత్వంలో డాక్టర్ బండి శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ బి. యాకూబ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ ఈ. హేమంత్, సీనియర్ రెసిడెంట్, డాక్టర్ ఎన్. హేమంత్, సీనియర్ రెసిడెంట్, అలాగే అనస్థీషియా విభాగానికి చెందిన డాక్టర్ భాను లక్ష్మి, ప్రొఫెసర్, విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జయప్రకాశ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, డాక్టర్ జాకీర్, సీనియర్ రెసిడెంట్, నర్సింగ్ సిబ్బంది రాజేష్, అజయ్ సహకారంతో ఎడమ మోకాలుకు మోకాలు మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. శస్త్రచికిత్స ఎటువంటి సమస్యలు లేకుండా పూర్తయింది. ముందుగా ఉన్న మోకాలి వైకల్యాన్ని విజయవంతంగా సరిచేసి, మోకాలి సరైన అమరిక మరియు స్థిరత్వాన్ని పునరుద్ధరించారు. ఈ మోకాలు మార్పిడి శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించడం రామగుండంలోని సింగరేణి ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆర్థోపెడిక్స్ విభాగానికి ఒక ముఖ్యమైన విజయంగా నిలిచింది. ఈ విజయంతో ప్రాంత ప్రజలకు అధునాతన కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స సేవలను అందించే సంస్థ సామర్థ్యం మరింత బలోపేతమైంది. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హిమబిందు సింగ్ మరియు ఆర్ఎంఓ డాక్టర్ కృపాభాయి ఆర్థోపెడిక్స్ విభాగం వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, సహాయక సిబ్బంది సమన్వయంతో చేసిన కృషిని ప్రత్యేకంగా అభినందించారు. మోకాలు మార్పిడి వంటి అధునాతన వైద్య సేవలను ప్రభుత్వ వైద్య సంస్థలో విజయవంతంగా అందుబాటులోకి తీసుకురావడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తూ, ఆర్థోపెడిక్స్ విభాగం మొత్తం బృందాన్ని అభినందించారు.

# గన్నేరువరం పీహెచ్‌సీ పనులు వేగవంతం చేయాలి

గన్నేరువరం, ఆగస్టు 18 (జనంసాక్షి):గన్నేరువరం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవన నిర్మాణ పనులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్. కవ్వంపల్లి సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన భవనంలోని అన్ని గదులను పరిశీలించి, నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వైద్య మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గన్నేరువరం మండల ప్రజలకు అందుబాటులో ఉండేలా నిర్మిస్తున్న నూతన పీహెచ్‌సీ భవనాన్ని అన్ని సౌకర్యాలతో పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పీహెచ్‌సీ



అందుబాటులోకి వస్తే మండల ప్రజలకు స్థానికంగానే మెరుగైన ప్రాథమిక వైద్య సేవలు అందే అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. వైద్యులు, సిబ్బందికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంతో పాటు రోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భవన నిర్మాణం చేపట్టాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్.రాజగోపాల్,కాంట్రాక్టర్ కటకం తిరుపతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పులి కృష్ణ, కొమ్మెర రవీందర్ రెడ్డి, తిప్పర్తి పరిపూర్ణచారి, తదితరులు ఉన్నారు.

# రుద్రంగిలో ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి

రుద్రంగి, ఆగస్టు 18 (జనం సాక్షి)రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల అధ్యక్షులు దయ్యాల ఉదయ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి కట్కూరి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కట్కూరి రమేష్ మాట్లాడుతూ.. పాపన్న గౌడ్ అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీక అని, బహుజనుల హక్కుల కోసం చేసిన పోరాటం నేటి తరానికి ఆదర్శమని అన్నారు. పాపన్న చరిత్రను యువతలోకి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కట్కూరి



శంకర్,మండల ఉపాధ్యక్షులు ఎనుగందుల సతీష్, గ్రామ అధ్యక్షులు నల్ల నవదీప్, లింగాల రవి, ప్రధాన కార్యదర్శి లింగంపల్లి సుదర్శన్, కోశాధికారి కర్రె గణేష్, కట్కూరి వినోద్, మండల కోశాధికారి కాదాసు అనిల్, సలహాదారు కాదాసు సంతోష్ తో పాటు నాయకులు, కార్యకర్తలు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ



మల్యాల ఆగస్టు 18 (జనం సాక్షి)జగిత్యాల కరీంనగర్ ప్రధాన రహదారి ప్రముఖ పుణ్యక్షేత్రం దిగువ కొండగట్టు వద్ద పెట్రోల్ బంక్ సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన ఆర్టీసీ బస్సు లారీ ఢీకొన్న రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని మంగళవారం జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్ పరిశీలించారు.ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలించిన ఎస్పీ ,ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు తదితర అంశాలపై సంబంధిత పోలీసు అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ప్రమాదానికి సంబంధించిన ప్రతి అంశాన్ని పరిశీలించి,వాస్తవాలను వెలికితీసే విధంగా దర్యాప్తు చేపట్టాలని అధికారులకు సూచించారు.ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలనివాహనదారులు అధిక వేగంతో వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని సూచించారు.ప్రధాన రహదారులపై మరింత అప్రమత్తంగా ప్రయాణించాలని తెలిపారు.డీఎస్పీ పురుషోత్తం రెడ్డి,డిటిఓ మహమ్మద్ సందాని, సీ.ఐ మాదాస్ రాజ్ కుమార్,ఎన్ హెచ్ అధికారులు ఉన్నారు.



## తాటిపెల్లి గురుకులంలో ఉచిత హెచ్‌పీవీ టీకా క్యాంపెయిన్



మల్యాల ఆగస్టు 18 (జనం సాక్షి)భారత ప్రభుత్వం చేపట్టిన జాతీయ ఉచిత హెచ్‌పీవీ టీకా క్యాంపెయిన్ ను తాటిపెల్లి గురుకుల పాఠశాలలో మంగళవారం నిర్వహించారు.కార్యక్రమాన్ని డి.ఐ.ఓ డా.నరేంద్ర రావు మరియు ఏం.వో డా.అస్మా పర్యవేక్షించారు. ప్రధానంగా 14 సంవత్సరాల వయస్సు ఉన్న బాలికలకు హెచ్‌పీవీ టీకా వేస్తున్నారని,టీకా వల్ల కలిగే ప్రయోజనాలను,ఆరోగ్య పరిరక్షణలో టీకాల పాత్ర పై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ డి.జ్యోతి, ప్రిన్సిపాల్ మానస,నర్సింగ్ ఆఫీసర్ సుజాత,సూపర్ వైజర్ శ్రీనివాస్,రమణమ్మ,సహాయక సిబ్బంది పాల్గొన్నారు.

### వరల్డ్ ఫోటో గ్రాఫీ డే ఆగస్టు 19 ప్రపంచ ఫోట గ్రఫీ దినోత్సవ సందర్భంగా

## సాన్వి డిజిటల్ ఫోటో గ్రాఫర్ శంకర్ చక్రి తీసిన అద్భుత చిత్రాలు







**ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 18, (జనంసాక్షి) :**
ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన పాలోజి శంకర్ చక్రి గత 28 సంవత్సరాల నుండి ఫోటో గ్రాఫర్‌గా వృత్తిని ఎంచుకుని చిన్నతనం నుండే పోటో గ్రాఫీ రంగం వైపు అడుగు వేసి తన అన్న ఫోటో గ్రాఫర్ కాగా అన్నతో కలిసి ఫోటో గ్రాఫీ రంగంలో రాణిస్తూ బ్లాక్ అండ్ వైట్ రీల్ పోటో నుంచి డిజిటల్ వరకు అద్భుత చిత్రాలు ఎన్నో తీసి పలు సర్టిఫికెట్స్ సెలెక్ట్ అయిన ఫోటోస్ తీసిన ఎన్నో అద్భుతాలు ఉన్నాయి ప్రపంచ ఫోటో గ్రాఫీ దినోత్సవ సందర్భంగా తాను తీసిన చాయి చిత్రాలను పలువురిని ఆకట్టుకున్న చిత్రాలను తీసి మన్ననాలు పొందారు పొందుతున్నారు. సాన్వి డిజిటల్ ఫోటో స్టూడియో నిర్వాహకులు పాలోజి





శంకర్ చక్రి ప్రపంచ ఫోటో గ్రాఫీ దినోత్సవ సందర్భంగా తీసిన ఛాయాచిత్రాలు







## పండుగ సాయన్న విగ్రహ ఏర్పాటుకు కలెక్టర్‌కు ముదిరాజ్ సంఘం వినతి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 జనంసాక్షి**
కామారెడ్డి జిల్లా కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ముదిరాజ్ సంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పండుగ సాయన్నను వారు కొనియాడారు. నిజాం నిరంకుశ పాలనలో భూస్వాములు, పెత్తందారుల ఆధిపత్యం కొనసాగుతున్న సమయంలో అణగారిన వర్గాల అభ్యున్నతికి పండుగ సాయన్న విశేషంగా కృషి చేశారని నాయకులు తెలిపారు. కుల, మత భేదాలకు అతీతంగా ఆడపిల్లల వివాహాలు జరిపిస్తూ అనేక కుటుంబాలకు పెద్దన్నగా అండగా నిలిచారని పేర్కొన్నారు. కేవలం 36 ఏళ్ల జీవితకాలంలోనే బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తిగా పండుగ సాయన్న చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. ఆయనను హతమార్చేందుకు భూస్వాములు కుట్ర పన్నినప్పుడు సామాన్య ప్రజలు ఏకమై తిరగబడిన ఘటన ఆయనపై ప్రజలకు ఉన్న అభిమానానికి నిదర్శనమని తెలిపారు. పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి, వ్యక్తిత్వం, సామాజిక సేవలను భావితరాలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో, జిల్లాలో గణనీయమైన జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గం ఆత్మగౌరవానికి ప్రతీకగా జిల్లా కేంద్రంలో పండుగ సాయన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు జిల్లా యంత్రాంగం సహకరించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, పున్న రాజేశ్వర్, నీల నాగరాజు, గజ్జెల బిక్షపతి, నంద రమేష్, గేరిగంటి లక్ష్మీనారాయణ, సునుగూరి బానుప్రకాష్, దాకి అరవింద్, కాళ్ల గంగారాజు, పిల్లి మల్లేష్, చింతల రమేష్, మోడేగామ్ మహేష్, బట్టు నర్సింలు, ప్రసాద్, బర్ల స్వామి, కనికంటి రమేష్, నర్సింలు, చిట్యాల రమేష్, పిట్ల శంకర్, కనకంటి రమేష్, బాల్ నర్సులు, స్వామి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు జరిగే మంత్రుల సభ స్థలిని పరిశీలించిన

## ప్రభుత్వ విప్ విజయ రమణారావు

ఎన్ ఎస్ యు ఐ యూత్ కాంగ్రెస్ మహిళా కాంగ్రెస్ అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఎం రేవంత్ రెడ్డి పెద్దపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఇప్పటికే వేలాది కోట్ల రూపాయలు మంజూరు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు అని కొనియాడారు. గత పది సంవత్సరాల బి ఆర్ ఎస్ అధికారంలో ఉండి అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టం ఉన్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని బస్ డిపో ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. అంతేకాకుండా బైపాస్ రోడ్డు నిర్మాణం కూడా జరుగుతుందని తెలిపారు. సుల్తానాబాద్ మున్సిపల్ను ఇప్పటికే సుందరంగా తీర్చిదిద్దామని, రానున్న రోజులలో మరింత సుందరీకరణలో భాగంగా పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేస్తామన్నారు. సుల్తానాబాద్ ఊర చెరువును మినీ ట్యాంక్ బండ్ ఏర్పాట్లు భాగంగా పనులు కొనసాగుతున్నాయని, డబల్ రోడ్డు పనులు కూడా కొనసాగుతున్నాయని తెలిపారు. రానున్న మూడు సంవత్సరాల కాలంలో అన్ని అభివృద్ధి పనులు చేసి చూపెట్టుతానని విజయ రమణారావు స్పష్టం చేశారు. ప్రతిపక్షాలకు ఆరోపణ చేయడానికి వీలు లేకుండా ప్రతి సంక్షేమ పథకం గడపగడపకు అమలు చేస్తామని, నూతనంగా ఒంటరి మహిళ, వికలాంగుల, వితంతు పింఛన్లతో పాటు మరిన్ని పింఛన్లు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంతటి పుష్పలత, రెవెన్యూ డివిజనల్ అధికారి మల్లేశం, మున్సిపల్ కమిషనర్ టి రమేష్, తోపాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దన్నాయక్ దామోదర్ రావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలక సతీష్, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ 7అధ్యక్షులు వేగోళం అబ్బయ్య గౌడ్, కౌన్సిలర్లు గాజుల రాజమల్లు ఉట్ల వర ప్రదీప్,తొర్రికొండ ప్రభాకర్,గరిగే శోభారాణి శ్రీనివాస్,గాదాసు మంజుల రవీందర్,చింతల రాజు,సిద్ధ తిరుపతి,ఈర్ల స్వరూప శేఖర్‌తో పాటు దుగ్యాల సంతోష్‌రావు,అల్లిపూర్ సర్పంచ్ కోదాటి సాయికిరణ్,సింగిల్ విండో చైర్మన్ అన్నెడి భాస్కర్ రెడ్డి,ముస్త్యాల రవీందర్,ఏరుకొండ రమేష్,చిలుక రాజేశం,యువ నాయకులు గాజుల హరీష్, రౌతు సూర్యం,ఆరెపల్లి కిరణ్ తో పాటు తదితరులు పాల్గొన్నారు. సీఐ పొన్నమనేని రంజిత్ రావు,ఎస్సై చంద్రకుమార్ తోపాటు సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు భూసార పరీక్షలపై శిక్షణ



**చొప్పదండి, ఆగస్టు 18( జనం సాక్షి):**
మండలంలోని రుక్మాపూర్ తెలంగాణ మోడల్ పాఠశాలలో విద్యార్థులకు భూసార పరీక్ష కేంద్రం కరీంనగర్ వ్యవసాయ అధికారి ,చొప్పదండి మండల వ్యవసాయ అధికారి మమత గారు విద్యార్థులకు సాయిల్ హెల్త్ ఫెర్టిలిటీ అండర్ పిఎం ఆర్ కే వి వై పథకంలో భాగంగా భూసార పరీక్షలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు . ఇందులో భాగంగా రుక్మాపూర్ క్లస్టర్ పరిధిలోని మోడల్ స్కూల్ విద్యార్థులకు భూసార పరీక్షలు నేల ఆరోగ్యం సమతుల్య ఎరువుల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు భూసార నమూనా సేకరణ, భూసార పరీక్ష విధానం, ఫలితాల ప్రాముఖ్యత ,భూసార కార్డుల ఆధారంగా ఎరువుల వినియోగంపై ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారి అనూష , స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్ , సైన్స్ టీచర్ మంజూరు అహ్మద్ రుక్మాపూర్ గ్రామ సర్పంచ్ ప్రేమలత - శ్రీనివాస్ , 8, 9వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు .

## కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిని కలిసిన కథలాపూర్ మండల బీజేపీ శాఖ

**కథలాపూర్ ఆగస్టు 18 (జనం సాక్షి )**
కథలాపూర్ మండల్ బిజెపి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రోజున కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు,కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ని కరీంనగర్ వారి నివాసంలో కథలాపూర్ మండల అభివృద్ధి కొరకై ఎంపీ నిధులు ఇవ్వాలని కోరగా శాను కూలంగా స్పందించి త్వరలోనే నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఎంపీ బండి సంజయ్ కి మండల శాఖ తరుపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు ఈ కార్యక్రమంలో బీజేపి మండల అధ్యక్షులు మల్యాల మారుతి,జిల్లా ఉపాధ్యక్షులు రాచమడుగు వెంకటేశ్వరావు,కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కొడిపెల్లి గోపాల్ రెడ్డి,సీనియర్ నాయకులు బద్రి సత్యం,కథలాపూర్ మహేష్, తెడ్డు మహేష్ కలవడం జరిగింది.





## గ్రామపంచాయతీ సిబ్బందికి బట్టల పంపిణీ

**కమ్మర్పల్లి ఆగష్టు 18(జనంసాక్షి)**
మండలంలోని హాసకొత్తూరు గ్రామ మాజీ సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ కుమారుని పుట్టినరోజు సందర్భంగా గ్రామపంచాయతీ పరిశుద్ధ కార్మికులకు మంగళవారం రోజున బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నలిమేల రేవతి గంగారెడ్డి మాట్లాడుతూ మాజీ సర్పంచ్ ఏనుగు పద్మ రాజేశ్వర్ కుమారుని పుట్టిన రోజున గ్రామానికి సేవ చేస్తున్న పారిశుద్ధ కార్మికులకు బట్టలు పంపిణీ చేయడం చాలా మంచి విషయమని ప్రతి ఒక్కరూ తోటి వారికి తోచినంత సహాయం చేసే గుణం అందరూ అలవాటు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా బట్టలు పంపిణీ చేసిన మాజీ సర్పంచ్ కుటుంబానికి పారిశుద్ధ కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఏనుగు మనోహర్,వార్డ్ నెంబర్ సామా నవీన్, పంచాయతీ కార్యదర్శి నల్లగంటి నర్సయ్య, ఏఎన్ఎం మమత,అంగన్వాడి టీచర్ అంజని దేవి గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి: ఏబీవీపీ



**కరీంనగర్ టౌన్ ఆగష్టు 18, ( జనం సాక్షి)**
తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ జాతీయ కార్యదర్శి శ్రావణ్ బి. రాజ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేసి విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను త్వరితగతిన భర్తీ చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులను ఏకం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యులు మల్యాల రాకేష్, అజయ్, జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, నగర కార్యదర్శి యోగేష్, రాష్ట్ర హాస్టల్ కన్వీనర్ బామాండ్ల నందుతో పాటు కార్యకర్తలు అజయ్, శివ, విఘ్నేష్, ఆకాష్, యశ్వంత్, నిత్య, బన్నీ, రాజేందర్, సూర్యవంశీ తదితరులు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా

**కళ్యాణ లక్ష్మి పథకాన్ని కొనసాగించాలి: మాజీ ఎంపీపీ**

**పెద్ద కొడప్గల్ ఆగస్టు 18 (జనంసాక్షి):**
పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ చౌరస్తాలో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ... పేదింటి ఆడ కూతురి పెళ్లి కుటుంబ సభ్యులకు భారం కాకూడదని, ఆర్థికంగా ఆదుకొనుటకు గత ప్రభుత్వంలో కేసీఆర్ మంచి మనసుతో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని రద్దు చేయుటకు కుట్ర చేస్తుందని తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సతీశ్ యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పథకాలు రద్దు చేసే ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

**మంథని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ**

**మంథని, ఆగస్టు 18, ( జనంసాక్షి ) :**
ఆనాడు పేద ప్రజల సంక్షేమం కోసం గొప్పగా ఆలోచన చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక పథకాలను అమలు చేశారని, అలాంటి గొప్ప పథకాలను రద్దు చేసేందుకు కుట్ర చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని మంథని మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పుట్ట శైలజ డిమాండ్ చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందేలా చూస్తే ఈనాడు కాంగ్రెస్ ప్రభుత్వం పేదోడి కలలను చెరిపేస్తుందన్నారు. కళ్యాణలక్ష్మిలాంటి గొప్ప పథకాన్ని లేదు అని నెమ్మదిగా రద్దు చేసేందుకు ప్రయత్నం చేస్తుందని ఆమె అన్నారు. కళ్యాణ లక్ష్మి పథకంపై చేసే పోరాటంలో ప్రతి పేదింటి బిడ్డ బాగస్వామిలై మన హక్కులను సాధించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పేదింటి ఆడబిడ్డల కోసం మాతాశిశు ఆస్పత్రి కట్టిస్తే కనీసం వైద్యులను నియమించలేదని, తాము ఆందోళన చేసే వరకు మంథని ఎమ్మెల్యేకు సోయి రాలేదని ఆమె ఎద్దేవా చేశారు. కళ్యాణలక్ష్మి పథకం కొనసాగించే బాధ్యత 420హామీలు రాసిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.



## నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో పోలీస్ (కానిస్టేబుల్ / సబ్- ఇన్స్పెక్టర్)ల ఉచిత శిక్షణ పోలీస్ కమిషనర్ వెల్లడి

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 జనంసాక్షి :**
నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాదు , ఆర్మూర్ , బోధన్ డివిజన్ పరిధిలో గల నిరుద్యోగ యువతి , యువకులకు అర్హత కలిగిన అభ్యర్థులకు తెలంగాణ పోలీస్ శాఖ నియామకాలకు ఉపయోగపడే విధంగా ఉచిత పోలీస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుంది ని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య తెలియజేశారు.
దరఖాస్తు విధానం: అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారుల ద్వారా అందించబడే ఉనీనిఅశ్రీవ ఈనీటీఏ లింక్ క్యూ ఆర్ కోడ్ ద్వారా దరఖాస్తు ఫారం దరఖాస్తు చేసుకోవలెను.
స్క్రీనింగ్ టెస్ట్: 23 ఆదివారం ఉదయం 10:00 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంటల వరకు నిజామాబాద్ డివిజన్ వారు విజయ రూరల్ ఇంజనీరింగ్ కాలేజ్ మాక్లూర్ పోలీస్ స్టేషన్ యందు,ఆర్మూర్ డివిజన్ వారు క్షత్రియ ఇంజనీర్ కాలేజీ యందు,బోధన్ డివిజన్ వారు జూనియర్ ఇంటర్ డిగ్రీ కాలేజీ యందు
దరఖాస్తులు చేసుకోవాలని,పరీక్షా విధానం ఆబ్జెక్టివ్ విధానం లో 200 మార్కులకు. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని పైన తెలియజేసిన సెంటర్స్ నందు స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించబడుతుంది.
శిక్షణ ప్రారంభం: స్క్రీనింగ్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులు 01-09-2026 నుండి 31-10-2026 శిక్షణలో పాల్గొనవచ్చు.శిక్షణ సమయం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5:30 గంటల వరకూ2 నెలల శిక్షణ కాలంలో 10 గ్రాండ్ టెస్ట్ లు నిర్వహించబడతాయని, అందరు అభ్యర్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ అందించబడు తుందని తెలిపారు.ఫీజు ఇది పూర్తిగా ఉచిత కార్యక్రమం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది.గమనిక దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఎలాంటి సమాచారానికైనా ఈ దిగువ ఫోన్ నెంబర్ ను సంప్రదించగలరు.
క్రాంతి : 9951943656 , 8712533273 తెలిపారు.

## ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**ఇందిరమ్మ ఇండ్లను పూర్తి చేసుకోవాలి : జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ లో ఇందిరమ్మ ఇల్లు పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**పెద్దలింగాపూర్ లో పి హెచ్ సీ తనిఖీ**

**ఇల్లంతకుంట, ఆగస్టు - 18 (జనంసాక్షి )**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ గ్రామంలో పసుల రవళి ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తుండగా, మంగళవారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు. ఎంత విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు? ఎప్పటి వరకు పూర్తి చేస్తారో అని లబ్ధిదారును అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నాలుగు విడతల్లో రూ. ఐదు లక్షల ఆర్థిక సహాయం ప్రభుత్వం మంజూరు చేస్తుందని వెల్లడించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేసుకోవాలని సూచించారు.

**సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి**
సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఇల్లంతకుంట మండలం పెద్దలింగాపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ముందుగా ఫార్మసీ, మేల్, ఫిమేల్ వార్డులు పరిశీలించారు. ఉద్యోగులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ.. రోగులకు సేవలు అందించాలని సూచించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. పరిశీలనలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.



## బిఆర్ఎస్ పార్టీవి అన్ని అబద్ధాలే

- కాంగ్రెస్ పార్టీ అన్ని పథకాలు కొనసాగిస్తుంది
- కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సూరదేవరాజు

**సిరిసిల్ల టౌన్ ఆగష్టు 18 (జనంసాక్షి)**
సిరిసిల్ల నియోజకవర్గ ఎమ్మెల్యేకే,టీ.ఆర్ ఆదేశాల మేరకు నిన్నటి రోజున షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాలను కాంగ్రెస్ పార్టీ ఆపివేసింది అంటూ ఆందోళన చేపట్టడం సరైంది కాదని, ఈ పథకాలను ఎక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం ఆపివేసింది లేదని, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు తెలిపారు, బి.ఆర్ఎస్ పార్టీ తీసుకువచ్చిన పాలనలోకి పథకాలలో చట్టబద్ధత లేదని, ఒక లాయరు పిటీషన్ దాఖలు చేయడం జరిగిందని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ తీసుకు వచ్చిన పథకాల్లో సరైన జీ,వో లేదని, అందువల్లే కోర్టు చట్టబద్ధత లేదని దీనిపైన సమాచారం ఇవ్వాలని పేర్కొందని అన్నారు. షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాల్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆపివేయదని, బిఆర్ఎస్ చేపట్టిన పథకాలన్నీ కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా ప్రజలచెంతకు చేరుస్తుందని పేర్కొన్నారు. బిఆర్ఎస్ పార్టీ అది పుట్టుక తోనే అబద్ధాల పార్టీ అని విమర్శించారు. కేటీఆర్ చెప్పే అబద్ధాలను ప్రజలు ఎవరు నమ్మరని అన్నారు.కాంగ్రెస్ పార్టీని బదనాం చేయడానికి ఒక లాయర్ ను పంపి ఈ కుట్రకు తెరలేపిందన్నారు. ఈ పథకాల్ని కొనసాగించాలని వచ్చేనెల 9వ తేదీన రాష్ట్రప్రభుత్వం కోర్టులో పిటిషన్ దాఖలు చేస్తుందని అన్నారు. ఈ పథకాలపై ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావద్దని కోరారు. పథకాలు యధావిధిగా కొనసాగుతాయన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆకునూరి బాలరాజు, తదితరులు పాల్గొన్నారు.






## విద్యార్థులకు నగదు పురస్కారం అందజేత

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 18, (జనంసాక్షి) :

ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అధిక హాజరు శాతం, కరికులర్, కోకరికులర్ అంశాలతో ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులకు స్వాతంత్ర దినోత్సవం రోజున నగదు పురస్కారం అందజేస్తామని ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ తెలియజేశారు.అందులో భాగంగా మంగళవారం రోజున అల్మాస్‌పూర్ గ్రామసర్పంచ్ నాగెల్లి వెంకట్‌రెడ్డి, ఉపసర్పంచ్ కొర్రి అనిల్ చేతుల మీదుగా ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికి 200 రూపాయల చొప్పున ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్‌లు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరవుతూ, చక్కగా చదువుకొని భవిష్యత్తులో మంచి స్థానానికి వెళ్లాలని పాఠశాలకు, గురువులకు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతాలు తీసుకురావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టేకుమల్ల శ్రీకాంత్, ఉపాధ్యాయులు వి. సౌజన్య, వి. రాజయ్యలు పాల్గొన్నారు.

## 19న జిల్లాస్థాయి సబ్‌జూనియర్, జూనియర్ యోగాసన పోటీలు

కరీంనగర్ కల్చరల్ ఆగస్టు 18 (జనం సాక్షి)

స్థానిక ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఈ నెల 19న జిల్లా స్థాయి సబ్‌జూనియర్, జూనియర్ యోగాసన పోటీల ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగిరెడ్డి సిద్ధారెడ్డి, గుంటి రామకృష్ణ తెలిపారు. 8 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు గల బాలబాలికలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని తెలిపారు. ఆసక్తిగల వారు జనన ధృవీకరణ పత్రం, ఆధార్‌తో ఈ నెల 19న ఉదయం 9 గంటలకు హాజరై ఎంట్రీలు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 9346827689 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

## రాజీవ్ యువ వికాస్ అమలు చేయాల్సిందే ఎండి నవాజ్



ముస్తాబాద్ ఆగస్టు 18 (జనం సాక్షి)

రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ యువతను మోసపుచ్చుతోందని బీఆర్ఎస్ యూత్ నాయకుడు ఎండి నవాజ్ మండిపడ్డారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై వారు పలు డిమాండ్లు చేస్తూ తీవ్ర విమర్శలు గుప్పించారు.రాజీవ్ గాంధీ జయంతి సద్భావన దినోత్సవం రోజున యువ వికాస్ పథకాన్ని అమలు చేసిన తర్వాతే నివాళులు అర్పించాలని, లేనియెడల తెలంగాణ యువతకు ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.సుమారు 16 లక్షల దరఖాస్తులు రాగా, వాటిలో 10 లక్షలు అర్హత సాధించినట్లు గుర్తించిన ప్రభుత్వం ఒక్కరికి కూడా లబ్ది చేకూర్చకపోవడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. క్యాస్ట్, ఇన్కమ్, రెసిడెన్సీ ఇతర ధృవీకరణ పత్రాల జిరాక్స్‌ల పేరుతో దరఖాస్తు చేసుకున్న యువత జేబుల నుండి సుమారు 50 కోట్లు నష్టం చేశారని విమర్శించారు. 2025 మార్చి నెలలో దరఖాస్తులు ప్రారంభించి నెల రోజుల పాటు స్వీకరించి, ఎంపీడీఓ మరియు బ్యాంకు అధికారుల సమయాన్ని వృథా చేశారని మండిపడ్డారు. 2026–27 బడ్జెట్‌లో రాజీవ్ యువ వికాస్ కోసం 5800 కోట్లు కేటాయించినట్లు చెప్పి, ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఆరోపించారు. ఎస్టీ యువతకు 1300 కోట్లు, ఎస్సీ యువతకు 2000 కోట్లు కేటాయించి బడ్జెట్‌లో వారిని నట్టేట ముంచారని ప్రభుత్వ తీరును ఎండగట్టారు. అమలు చేయకుండా నివాళులు అర్పించడం కాంగ్రెస్ నిస్సిగ్గుతనానికి నిదర్శనమని నిలదీశారు.రానున్న రోజుల్లో యువతకు జరిగిన అన్యాయాన్ని, కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరిత హామీల మానిఫెస్టోను ఇంటింటికీ వెళ్లి ఎవరిని వదిలిపెట్టకుండా బీఆర్ఎస్ యువత నిలదీస్తుందని హెచ్చరించారు.




## చట్టాలతో బాలల భద్రతకు భరోసా

రామడుగు(జనంసాక్షి):

చట్టాలతో బాలల భద్రతకు భరోసా చేకూరుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యులు, న్యాయవాదులు ఎ.కిరణ్ కుమార్, పెరుక రంగయ్య, సీహెచ్.చంద్రప్రకాశ్ రెడ్డి అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి యస్. శివకుమార్, సీనియర్ సివిల్ న్యాయమూర్తి కే. రాణి గారి ఆదేశాల మేరకు కరీంనగర్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రామడుగు మండలం వెలిచాల గవర్నమెంట్, సరస్వతి హైస్కూల్లో మంగళవారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చట్టాలపై అవగాహన ద్వారా పిల్లలు తమ హక్కులను తెలుసుకుని అన్యాయం, వేధింపులు, దోపిడీ వంటి ఘటనల నుంచి తమను తాము రక్షించుకుంటారని, చట్టాలతోనే బాలల భద్రతకు భరోసా కలుగుతుందన్నారు. బాలల హక్కులు, బాల్య వివాహాల నిషేధ చట్టం, పోక్సో యాక్ట్?2012, యాసిడ్ దాడుల బాధితులకు చట్టపరమైన రక్షణ, నల్సా ఆధ్వర్యంలోని ఎల్ఎస్యూసీ ద్వారా పిల్లలకు అందుతున్న ఉచిత న్యాయసేవలను వివరించారు. బాలల హక్కుల పరిరక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అర్హులైన పిల్లలు, మహిళలు, నిరుపేదలు, ఇతర బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సలహాలు, న్యాయ సహాయం, మధ్యవర్తిత్వ సేవలు, పర్మినెంట్ లోక్ అదాలత్ ద్వారా వివాద పరిష్కార సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పిల్లలపై హింస, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు లేదా ఇతర హక్కుల ఉల్లంఘనలకు సంబంధించిన సమాచారం తెలిస్తే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, అవసరమైతే 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 15100 ఉచిత న్యాయ సేవల హెల్ప్ లైన్ ను సంప్రదించాలని సూచించారు. బాలల భద్రత, హక్కుల పరిరక్షణ కోసం విధిగా బాలల రక్షణ విధానానికి అనుగుణంగా ప్రతి పాఠశాలలో చైల్డ్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసుకుని నిత్యం పర్యవేక్షించుకోవాలన్నారు. కార్యక్రమంలో సరస్వతి హైస్కూల్ కరస్పాండెంట్ ఉప్పుల శ్రీనివాస్, కో కరస్పాండెంట్ ఉప్పుల సత్యం, గవర్నమెంట్ స్కూల్ హెచ్ఎం రాజరాజేశ్వరీదేవి, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి పద్మలతాదేవి, టీచర్స్ పాల్గొన్నారు.

### నేషనల్ హైవే భూసేకరణలో పూర్తిస్థాయి పరిహారం చెల్లించాలని జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన నిర్వహితులు

ముత్తారం ఆగస్టు 18(జనంసాక్షి):

జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భూములు కోల్పోతున్న రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ముత్తారం మండలంలోని వివిధ గ్రామాల రైతులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.మంగళవారం ముత్తారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో జాతీయ రహదారి పనుల పురోగతి, భూసేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారంపై జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్కారం, సర్వారం, పోతారం, ఓడేడ్ గ్రామాలకు చెందిన రైతులు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.జాతీయ రహదారి నిర్మాణం కోసం భూసేకరణ చేపడుతున్న నేపథ్యంలో తమ భూములకు ఎలాంటి నష్టం జరగకుండా సమగ్రంగా మోకా (స్థల) విచారణ నిర్వహించాలని రైతులు కోరారు. భూముల వాస్తవ పరిస్థితులను పరిశీలించి, ప్రతి రైతుకు న్యాయబద్ధంగా పూర్తిస్థాయి నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు.రైతుల సమస్యలను విన్న జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు న్యాయమైన, పూర్తిస్థాయి పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీంతో రైతులు తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.





## పీఆర్‌టీయూ ధర్నా విజయవంతం చేయండి..

- జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్..

గోదావరిఖని, జనంసాక్షి :

సెప్టెంబర్ 1న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి పీఆర్‌టీయూ పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కానుగంటి శ్రీనివాస్ కోరారు. పెండింగ్ సమస్యల పరిష్కారం కోరుతూ పీఆర్సీ అమలు చేయాలని,సీపీఎస్ రద్దు చేయాలని చేపడుతున్న ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.రాబోయే రోజుల్లో ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కారం చేయకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేసి, పోరాట పటిమ ప్రదర్శించి ముందుకు రావాలన్నారు.మంగళవారం రామగిరి మండలంలోని పలు పాఠశాల ల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా పర్యటించినట్లు ఆయన పేర్కొన్నారు.సమస్యల ప్రస్తావన, పరిస్థితి, పరిష్కారం కోసం చేస్తున్న ప్రాతినిధ్యాల గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆడెపు రవి,రాష్ట్ర బాధ్యులు తిప్పని రాజేందర్,జిల్లా నాయకులు తాళ్ల నరేందర్, నాయకులు కొత్తపల్లి రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.




## శ్రీసత్య సాయి సదన్ ఆశ్రమానికి టెలివిజన్ వితరణ

జమ్మికుంట,ఆగస్టు 18 (జనంసాక్షి):

జమ్మికుంట పట్టణములోని మారుతి నగర్ లో గల శ్రీ సత్య సాయి సదన్ దివ్యాంగ విద్యార్థుల ఆశ్రమానికి అభివృద్ధి క్రమంలో భాగంగా ఎన్నో వస్తువులను వితరణ చేస్తూ,చేయిస్తూ వస్తున్న జడల భాస్కర రావు అమెరికాలో ఉన్న తన సహోదరుడు జడల రవికుమార్, శ్రీ రేఖ దంపతుల ఆర్థిక సహకారంతో సాయి సదన్ ఆశ్రమానికి 75 వేల రూపాయల విలువగల టెలివిజన్ ను వితరణ చేశారు.దివ్యాంగ విద్యార్థుల మనోవికాసానికి, వారి ఆనందానికి, వారి సంతోషానికి ఈ టెలివిజన్ ఎంతగానో ఉపయోగపడుతుందని జడల వారి సహకారం మరువలేనిదని, ఎన్నో సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్న జడల వారి కుటుంబ సభ్యులందరికీ పేరు,పేరునా మా మానసిక దివ్యంగ విద్యార్థుల తల్లితండ్రుల సంఘం తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నామని ఆశ్రమ వ్యవస్థాపకులు సూత్రపు బుచ్చి రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆశ్రమ సిబ్బంది జల భాస్కర్ రావుని ఘనంగా సన్మానించినారు.ఆశ్రమంలో కొత్తగా నిర్మాణం అవుతున్న శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని పరిశీలించి పరమశివుని వద్ద, నందీశ్వరుని వద్ద జడల భాస్కరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు.





సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కొనసాగించిన పోరాట స్ఫూర్తితో ముందుకెళ్లాలని వక్తలు పిలుపునిచ్చారు. సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనంసాక్షి



సిరికొండ మండల కేంద్రంతో పాటు కొండాపూర్, కొండూరు, పెద్దవాల్గొట్ గ్రామాల్లో బహుజన వీరుడు, గౌడ జాతి ముద్దుబిడ్డ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలను గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



నాగసోని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతిని పురస్కరించుకొని హైదరాబాద్ పట్టణంలోని ట్యాంక్ బండ్ పైన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతిని పురస్కరించుకొని భీంగల్ మండల గౌడ సంఘ నాయకుల ఆధ్వర్యంలో పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. భీంగల్,జనంసాక్షి



కథలాపూర్ మండలంలోని కేంద్రంలోని దుంపేట, భూషణరావుపేట, కథలాపూర్ గ్రామాలలో పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి వేడుకలు మంగళవారం రోజున దుంపేట సర్పంచ్ మల్యాల రమేష్ ఉపసర్పంచ్ యాటకర్ల నర్సయ్య,వార్డ్ మెంబర్స్ ఓంకార్, కిషోర్ మరియు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది.



చొప్పదండి పట్టణంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు చొప్పదండి గౌడ సంఘం అధ్యక్షులు బుర్ర మల్లేశం, యువజన సంఘం అధ్యక్షులు బొడిగె సాయి కృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ వడ్లూరి సరిత హాజరై పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



శాతవాహన విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద విద్యార్థులు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కరీంనగర్ టౌన్



గన్నేరువరం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు గౌడ సంఘ భవనంలో ఘనంగా నిర్వహించారు.



తెలంగాణ వీరుడు, బహుజన చైతన్యానికి ప్రతీకగా నిలిచిన సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు.



మల్లాపూర్ మండల్ సాతారం గ్రామంలో మంగళవారం రోజున సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.



సుల్తానాబాద్ మండల కేంద్రంలోని సర్వాయి పాపన్న విగ్రహం వద్ద పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను గౌడ సంఘం ఆధ్వర్యం లో ఘనంగా నిర్వహించారు.



మండలంలోని గొల్లపల్లి నారాయణరావుపల్లి గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 369 వ జయంతి ఉత్సవాలు ఘనంగా మొల్లురి అంజయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.



## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి ఘనంగా నిర్వహణ

కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఆగస్టు 18 (జనంసాక్షి) బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఎన్.వై. గిరి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని అన్నారు. సామాజిక అసమానతలను ఎదుర్కొంటూ ప్రజల కోసం ఆయన చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. పాపన్న గౌడ్ ధైర్యసాహసాలు, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు.

అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడంతో పాటు సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలను ముందుకు తీసుకెళ్లడం ద్వారా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను కొనసాగించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి నర్సయ్య, గౌడ సంఘాల ప్రతినిధులు, బహుజన సంఘాల నాయకులు, జిల్లా అధికారులు, ప్రభుత్వ ఉద్యోగులు, మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘనంగా నివాళులర్పించారు.



పెద్ద కొడప్గల్ మండల కేంద్రంలో మంగళవారం జై గౌడ ఉద్యమం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

# ప్రజావాణి లో పలుసమస్యలపై వినతిపత్రం అందించిన మహితాపూర్ గ్రామ వార్డు సభ్యులు




**రాయికల్ ఆగస్టు 17 జనంసాక్షి:** నూతనంగా ప్రతి మండల కేంద్రంలో ప్రతి సోమవారం రోజున రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో రాయికల్ మండల కేంద్రమైన స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి నోడల్ అధికారి భింగి చిరంజీవి పర్యవేక్షణ లో భాగంగా సోమవారం స్థానిక తహసిల్దార్ నాగార్జున మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మహితాపూర్ గ్రామానికి చెందిన పలు సమస్యలు గ్రామంలో మూడవ వార్డు యందు కోడి మ్యాల శారదా మరియు పాలిపెలి మల్లయ్య సంగ రాజు ల సందు లో కరెంట్ స్తంభాలు లేకపోవడంతో రాత్రివేళల్లో కరెంటు సరఫరా లేకపోవడంతో ఆసంది నుండి నడిచే వారికీ మరియు అక్కడ నివసిస్తున్న ఇండ్లకు సంబంధించిన వారి ఇండ్ల లో కీ రాత్రి వేళల్లో పగటిపూట అందరి గృహంలో నికి చాలా పెద్దా పెద్ద నాగు పాము లు ఇతర పాములు తరచుగా వస్తున్న నేపథ్యంలో అందరూ భయాందోళనకు గురవుతున్నారు. అందుకని మూడవ వార్డు లో మరియు ఒక్కటో వార్డు యందు కొయ్యడి సదా శివ రెడ్డి ఇంటి సందులో కరెంటు స్తంభాలు లేకపోవడంతో మరియు బేతి రాధ ఇంటి ముందు కొట్ట మూల వద్ద కరెంటు స్తంభాలు లేక పోవడంతో రాత్రి వేళల్లో అందరికీ ఇబ్బందులు పడుతున్నారు మరియు రెండవ వార్డు ఎనిమిదో వార్డు యందు బుడగజంగల కాలనీల యందుఅవసరమైనచోట్ల. అందుకుగాను వెంటనే స్తంభాలు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించాలని వార్డు సభ్యులు కోరారు మహితాపూర్ గ్రామ గన్నే గుట్ట దుర్గ మాతా ఆలయం వద్ద బస్సులు ఆపాలని వినతిపత్రం అంద చేసిన వార్డు సభ్యులు. మహితాపూర్ గ్రామంలో వెలసిన శ్రీ కనక దుర్గమ్మ గుడి దగ్గర గన్నే,గుట్ట పైన ఉన్న అమ్మవారిని దర్శించుకునుట కోరకు గ్రామస్తులు మరియు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు మరియు రాయికల్ మండల కేంద్రమైన పట్టణంలో నుండి మరియు కోరుట్ల మండలం నుంచి జగిత్యాల మండలం నుంచి వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు కానీ అటు కోరుట్ల బస్టాండ్ మరియు ఇటు రాయికల్ బస్టాండు వద్ద ప్రజలు మరియు దుర్గ మతా భక్తులు అధిక సంఖ్యలో బస్సులో ప్రయాణిస్తున్న నీదు వలన అక్కడ ప్రతి రోజూ మరియు ప్రతీ శుక్రవారం రోజూ చాలా భక్తులు అధిక సంఖ్యలో వస్తుంటారు కావున దుర్గ మాత ఆలయం గన్నె గుట్ట వద్ద బస్సులను అపాకా పోవటంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే అక్కడికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని వెంటనే బస్సు లు ఆపాలని సోమవారం జరిగిన రాయికల్ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజావాణి అధికారి నోడల్ అధికారి భింగి చిరంజివి కి వినతిపత్రం గ్రామ పంచాయతీ పరిధిలోని మూడవ వార్డు సభ్యులు అనుమల్ల రమ సత్యనారాయణ ఎనిమిదో వార్డు సభ్యులు యాదవ సంఘం అధ్యక్షులు బుస గంగా మల్లయ్య ఆరో వార్డు సభ్యులు భూపల్లి పరమేష్ లు కలిసి వినతిపత్రం అందజేశారు.

## విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

**కరీంనగర్ టౌన్, ఆగస్టు 17 ( జనం సాక్షి)** విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఇంటి ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అంగిడి కుమార్ మాట్లాడుతూ.. గత రెండున్నరేళ్లుగా విద్యార్థులకు రావాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. పేదరికం విద్యార్థుల చదువుకు ఆటంకం కాకూడదనే ఉద్దేశంతో అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. విద్యార్థుల నిరసనలు, విద్యాసంస్థల బంద్‌లు చేపట్టినా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. కమిటీల పేరుతో రెండేళ్లుగా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. రీయింబర్స్‌మెంట్ బకాయిల కారణంగా ఇంజినీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పలు విద్యాసంస్థల యాజమాన్యాలు చదువులు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 20లోపు కోర్టు ఆదేశాలను అమలు చేసి విద్యార్థుల ఖాతాల్లో స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు వెల్దిరాజు మానుపాటి కార్తీక్, మానుపాటి సవర్దన్, కట్ట శ్రీకర్, వంశీ, అరుణ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



## మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజావాణి తొలి రోజు 3 దరఖాస్తులు

**మల్యాల ఆగస్టు 17 (జనంసాక్షి)** మల్యాల మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1. గంట వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. తొలిరోజు 3 రెవెన్యూ సంబంధించిన ఫిర్యాదులే వచ్చాయని అధికారులు తెలిపారు. తొలి పిర్యాదు రేషన్ సమస్యపై రేషన్ కార్డు ఉన్నా 4 నెలలుగా బియ్యం రావట్లేదని,ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న 3 నెలల బియ్యం కూడా కోల్పోయే ప్రమాదం ఉందని నూకపల్లికి చెందిన మానస కుటుంబం తరపున ఆమె సోదరుడు ఫిర్యాదు చేశాడు. మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు యధావిధిగా కొనసాగించాలని,పెండింగ్లో ఉన్న లబ్ధిదారులకు వెంటనే,డబ్బులు చెల్లించాలని వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోనే పరిష్కరించగల సమస్యల కోసం తెలంగాణ ప్రభుత్వం మండల స్థాయిలోనూ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ప్రజలు మండల స్థాయి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వాతి,తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపివో ఆమని వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



## కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

- అర్హులైన బీడీ కార్మికులకు, వృద్ధులకు పెన్షన్లు అందించాలి
- సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్
- కార్యదర్శికి వినతి పత్రం అందజేత

**కోనరావుపేట(జనంసాక్షి):** కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన బీడీ కార్మికులు, వృద్ధులకు వెంటనే పెన్షన్లు అందించాలని అన్నారు. ప్రభుత్వం, సంబంధిత యాజమాన్యాలు కార్మికుల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కార్మికులను మోసం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు కావస్తున్నా అర్హులైన బీడీ కార్మికులకు, వృద్ధులకు పెన్షన్లు ఇస్తామని చెప్పి మాట తప్పారని ఎద్దేవ చేశారు. ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం మరియు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. కార్మికులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సునీల్, లావణ్య, భాస్కర్, లత, శివ, లక్ష్మణ్, శోభారాణి, లత, లవణ్య, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో వినతుల వెల్లువ

**ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, భూ సమస్యలతో 42 దరఖాస్తులు**

**రాయికల్ ఆగస్టు17జనంసాక్షి :** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి రాయికల్ మండలంలో విశేష స్పందన లభించింది. సోమవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై మొత్తం 42 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో భింగి చిరంజీవి తెలిపారు. శాఖల వారీగా పరిశీలిస్తే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 23, రెవెన్యూ శాఖకు 6, తెలంగాణ ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎన్‌పీడీసీఎల్)కు 4, మున్సిపల్ శాఖకు 5, గృహ నిర్మాణ శాఖకు 1, రోడ్లు?భవనాల శాఖకు 1, రోడ్డు రవాణా శాఖకు 1, ఆర్టీసీ శాఖకు 1 దరఖాస్తు చొప్పున అందాయి. పంచాయతీరాజ్, గ్రామీణభివృద్ధి శాఖకు అత్యధికంగా వినతులు రావడం గమనార్హం. ప్రజావాణిలో ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, సామాజిక భద్రతా పెన్షన్లు, భూ రికార్డుల సవరణ, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు, విద్యుత్ సమస్యలు, ఒంటరి మహిళ ధ్రువపత్రాలు, మున్సిపల్ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వచ్చాయి.




## భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



**గంగాధర ఆగస్టు17 ( జనంసాక్షి):** గంగాధర గ్రామంలో నూతనంగా ప్రతిపాదించిన డి81 కాలువ నిర్మాణం భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలని గ్రామస్తులు సోమవారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామంలోని ఎల్లమ్మ చెరువు ఆధారంగా ఉన్న పూరతన కాలువ ద్వారా గత అనేక దశాబ్దాలుగా పొలాలకు నిరందుతుంది ఆ నీటి సదుపాయంతో వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నామని అన్నారు. కాలువ నిర్మాణం చేపట్టడం వలన మా విలువైన వ్యవసాయ భూములు కోల్పోతామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే డి81 కాలువ నిర్మాణం భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు మడ్డపెల్లి గంగాధర్,జారతి రాజన్న,గంట కిషన్,చొల్లూరి రామయ్య,చిరుత చంద్రయ్య, రాజయ్య,సాగర్,లచ్చన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ యాక్షన్ ప్లాన్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష

◆ పీఎం అజయ్ పథకం కింద ఎస్సీ రైతులకు అవసరమైన బోర్‌వెల్స్ ఏర్పాటు చేయాలి



**పెద్దపల్లి,ఆగష్టు 18(జనంసాక్షి) :** ఎస్సీ యాక్షన్ ప్లాన్ లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.ఎస్సీ యాక్షన్ ప్లాన్, పీఎం అజయ్ పథకం, ప్రీ మెట్రిక్,పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు,సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,ఎస్సీ యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి నిర్దేశించిన లక్ష్యాలను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ సబ్సిడీ రుణాలకు సంబంధించి లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.జిల్లాలో ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు 297 మంది లబ్ధిదారుల లక్ష్యం కాగా, ఇప్పటివరకు 192 మంది లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన వారిలో 117 మంది లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు.మిగిలిన లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేయాలని, సబ్సిడీ మొత్తాన్ని క్లెయిమ్ చేసేందుకు వీలుగా లబ్ధిదారుల పేరుతో నాన్-ఆపరేటివ్ బ్యాంకు ఖాతాలను బ్యాంకులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.పీఎం అజయ్ పథకం కింద ఎస్సీ రైతులకు అవసరమైన బోర్‌వెల్స్ ఏర్పాటు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.అర్హులైన రైతులకు పథకం ప్రయోజనాలు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు అర్హులైన విద్యార్థులందరూ సకాలంలో దరఖాస్తులు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఒక్క అర్హత కలిగిన విద్యార్థి కూడా స్కాలర్‌షిప్‌కు దూరం కాకుండా దరఖాస్తుల ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు.సంక్షేమ వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతు పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన డైట్‌ను తప్పనిసరిగా అందించాలని ఆదేశించారు.విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, మంచి వాతావరణం కల్పించాలని అధికారులకు సూచించారు.సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని, వసతి గృహాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రవణ్ కుమార్,డీఎస్‌సీడీవో రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు

- సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అధికారిక వేడుకల నిర్వహణ

**పెద్దపల్లి,ఆగష్టు 18(జనంసాక్షి) :** సమానత్వానికి, వీరోచిత పోరాటానికి ప్రతీకగా నిలిచిన చారిత్రక యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ఆదేశాల మేరకు మంగళవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల (బీసీ) అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ బి. శ్రీరాములు జ్యోతి ప్రజ్వలన చేసి, పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బి.శ్రీరాములు మాట్లాడుతూ సర్వాయి పాపన్న గౌడ్ 1650 ఆగస్టు 18న ఒక సాధారణ కుటుంబం జన్మించి,అసాధారణ సాహసంతో గోల్కొండ కోటను స్వాధీనం చేసుకుని గొప్ప పరిపాలన అందించారని ప్రజల కోసం ఆయన చేసిన పోరాటాలు త్యాగాలను స్మరించుకుంటూ ఏటా అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహించడం గర్వకారణమన్నారు.బీసీ సంఘాల నాయకుల విజ్ఞప్తి మేరకు,భవిష్యత్తులో సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలను మండల,గ్రామ స్థాయిలో అధికారికంగా నిర్వహించేలా జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని అదనపు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారిజె.రంగారెడ్డి, జిల్లా అధికారులు, జిల్లా బీసీ సంఘాల నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశం..

- ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి..

గోదావరిఖని, జనంసాక్షి :బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్‌గౌడ్ అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్‌రావు, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు కె.లక్ష్మణ్‌లి,మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో ఓబీసీ వర్గాల సంక్షేమం,వారి హక్కుల పరిరక్షణ,కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం,పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.అలాగే ఓబీసీ సమాజ అభ్యున్నతి, సంక్షేమం,హక్కుల పరిరక్షణకు సంబంధించిన పలు కీలక తీర్మానాలను సమావేశంలో ప్రవేశపెట్టి ఆమోదించడం జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కందుల సంధ్యారాణి మాట్లాడుతూ 'కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మకంగా ఓబీసీ సమాజాన్ని మోసం చేస్తూనే వచ్చిందన్నారు.ఎస్సీ,ఎస్టీ, ఓబీసీల హక్కులను పక్కనబెట్టి ముస్లిం రిజర్వేషన్లకు ప్రాధాన్యం ఇవ్వడం నుంచి,తెలంగాణలో బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ఒక్క హామీని కూడా అమలు చేయకపోవడం వరకు కాంగ్రెస్ వైఖరి తెలియజేస్తుందన్నారు.'కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం తన పదవీకాలంలో ఒక్క ఓబీసీ అధికారిని కూడా సెక్రటరీ స్థాయిలో నియమించలేదన్నారు.నేడు కాంగ్రెస్ పాలనలో ఉన్న నాలుగు రాష్ట్రాల్లో ఒక్క ఓబీసీ ముఖ్యమంత్రి కూడా లేరన్నారు.అదేవిధంగా,ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో ఓబీసీ సమాజ సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అనేక పరివర్తనాత్మక కార్యక్రమాలను ఆమె వివరించారు.'పీఎం విశ్వకర్మ యోజన నుంచి జాతీయ వెనుకబడిన తరగతుల కమిషన్‌కు రాజ్యాంగబద్ధ హోదా కల్పించడం వరకు,మోదీ ప్రభుత్వం ఓబీసీల సంక్షేమం, అభ్యున్నతి కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తోంది.ఓబీసీ వర్గాలకు రాజకీయ, సామాజిక, ఆర్థిక సాధికారత కల్పించడమే బీజేపీ లక్ష్యం" అని ఆమె తెలిపారు.ఓబీసీ సమాజానికి బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అవకాశాలను ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో ఓబీసీ సమాజానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలపై చర్చించి, వారి హక్కులు,సంక్షేమం, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం తదితర అంశాలకు సంబంధించి పలు తీర్మానాలను వారు ప్రవేశపెట్టడం జరిగింది.ఓబీసీ వర్గాల అభివృద్ధి కోసం భవిష్యత్ కార్యాచరణపై కూడా సమావేశంలో నిర్ణయాలు తీసుకున్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గాజుల ముఖేష్, ప్రభాకర్ యాదవ్, జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు వైస్ ప్రెసిడెంట్లు సత్యనారాయణ, నారాయణ, రఘురామయ్య, సంజయ్,సుజాత, జిల్లా అధ్యక్షులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# మేయర్ సాబ్ జర దేకో..

**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం నగరపాలక సంస్థ పరిధి 36వ డివిజన్‌లోని గోదావరిఖని బస్‌స్టేషన్ రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్డు ముక్కలుముక్కలుగా తయారైంది.బస్‌స్టేషన్‌కు అతిసమీపంలో ఉన్న ఈ రహదారిని పట్టించుకున్న పాపానపోలేదు.రాజీవ్ రహదారి సర్వీస్ రోడ్డే అయినప్పటికి దాని మరమ్మతులు చేయడంలో కేహెచ్‌ఆర్ విఫలమవుతోందని పలువురు అంటున్నారు.నిత్యం వేలాది మంది ఈ రహదారి గుండా నడుస్తూ ఉంటారు.అనేక మంది ద్విచక్ర వాహనాలు, పెద్ద వాహనాలు నిత్యం తిరుగుతూనే ఉంటాయి..అయినా అటు హెచ్‌కేఆర్ వాళ్లు కానీ, ఇటు మున్సిపల్ అధికారులు కానీ ఈ రోడ్డును పట్టించుకున్నా పాపానపోలేదని పలువురు ఆవేదన చెందుతున్నారు.వర్షాకాలం కావడంతో ఈ రోడ్డు చిత్తడిగా మారుతోంది.దానితో రోడ్డుమీద నడువాలన్న..వాహనాల్లో వెళ్లాలన్న అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.ఇప్పటికైనా నగర మేయర్ మహంకాళి స్వామి చొరవతీసుకోవాలని..యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.

**జీడీకే.1,3 గనుల్లో నషా ముక్తి భారత్ అభియాన్ అవగాహన..**

గోదావరిఖని, జనంసాక్షి : సింగరేణి ఆర్‌జి-1 ఏరియా జీఎం, జీడీకే.1 అండ్ 3 గనులపై ఏజెంట్ ఆదేశాల మేరకు నషా ముక్తి భారత్ అభియాన్ అవగాహన కార్యక్రమాన్ని బ్రహ్మకుమారి పద్మ మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉద్యోగులకు మద్యం, ధూమపానం, గుట్కా, పొగాకు తదితర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు,ఆరోగ్యంపై వాటి ప్రభావం, కుటుంబ జీవితంపై పడే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలని సూచించారు.అనంతరం ఉద్యోగులతో నషా ముక్తి భారత్ ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ సుధీర్ జక్కుల్వార్, ఎఫ్ఎం(ఐఎ) మోహన్‌రావు, బ్రహ్మకుమారి పద్మ, భద్రతా అధికారి జి.మహేష్, విఓ పర్యావరణ అధికారి ఎన్.శ్రీను, హెచ్ఓఎం పి.శేఖర్, పిట్ కార్యదర్శి కె.రాజేష్,అధికారులు,పర్యవేక్షకులు,ఉద్యోగులు పాల్గొన్నారు.

# సుల్తానాబాద్ లో విన్నూతన కార్యక్రమానికి శ్రీకారం

**సుల్తానాబాద్,ఆగష్టు 18(జనంసాక్షి) :** ఈనెల 5న మున్సిపల్ ,12వ వార్డు పరిధి తెలంగాణ గ్రామీణ బ్యాంకు సమీపంలో రోడ్డు దాటుతున్న కోతుల గుంపును కారు ఢీకొనడంతో ఐదు కోతులు అక్కడికక్కడే మృతి చెందగా రెండు కోతులు తీవ్రంగా గాయపడ్డాయి..మృతి చెందిన కోతులను ఆంజనేయస్వామి ప్రతి రూపంగా భావించి,శాస్త్రబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించి,14 వ రోజు సందర్భంగా సుల్తానాబాద్ మున్సిపల్ 12వ వార్డు కౌన్సిలర్ అమిరిశెట్టి శ్రావణి - రాకేష్ ఆధ్వర్యంలో శాస్త్రినగర్లోని శ్రీ శ్రీ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజారి గూడ రమేష్ శర్మ చె శాస్త్రబద్ధంగా పూజలు నిర్వహించి, కోతుల చిత్రపటానికి పూలమాలలు వేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాయిరి మహేందర్, ముస్త్యాల రవీందర్, కందుకూరి పెద్దన్న, అమిరిశెట్టి తిరుపతి, అమిరిశెట్టి రాజలింగం,వేగోలం అబ్బయ్య గౌడ్,కుమార్ కిషోర్,కల్వల ఓదెలు, గుండేటి దేవేందర్,ఈర్ల శేఖర్,దొడ్ల సందీప్,నయీమ్,పెగడ పరుశు రాములు,ఎల్ల రాజు, సమీర్, కన్నం చైతన్య,12వ వార్డు పరిధి మహిళలు, సుమారు 300 మంది కి పైగా భక్తులు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



### ప్రభుత్వం విద్య రంగానికి రూ.16 కోట్ల నిధులతో

# పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేస్తాం



- గ్రామాల అభివృద్ధికి ప్రజల సమస్యలపై సర్పంచులు అందుబాటులో ఉండాలి
- పంచాయతీ సెక్రెటరీలు సర్పంచ్ ల సమన్వయంతో గ్రామంలోని సమస్యలు గుర్తించాలి
- పెద్దపల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు





**పెద్దపల్లి,ఆగస్టు 18(జనంసాక్షి) :**
పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్కే గార్డెన్స్ లో ఎంపీడీఓ కొప్పుల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు.ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించి గ్రామాల్లో ఉన్నటువంటి సమస్యలను సర్పంచులు, అధికారులకు ప్రభుత్వ విప్ విజయరమణ రావు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.ఈ సందర్బంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ అధికార యంత్రాంగం మరియు 30 గ్రామాల సర్పంచ్‌లు ప్రతి అంశంపై చర్చించారు. ప్రధానంగా విద్య, వైద్యం, తాగునీరు, విద్యుత్, పంచాయతీ రాజ్ ఇంజనీర్, ఆర్‌డబి, పంచాయతీ రాజ్ మరియు వ్యవసాయ శాఖ, మీషన్ భగీరథ వివిధ శాఖల అధికారులు, సర్పంచులతో కలిసి సమీక్షించడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ అధికారులు గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి సర్పంచుల సమన్వయంతో పరిష్కరించాలన్నారు. గ్రామాల అభివృద్ధికి సర్పంచులు ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు తీర్చాలన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తుందని పెద్దపల్లి మండల విద్యాభివృద్ధికి 16 కోట్ల నిధులు ఖర్చు చేసామన్నారు. నూతన పాఠశాల భవనాలు, భవనాల మరమ్మతులు, కాంపౌండ్ వాల్స్ నిర్మాణం, టాయిలెట్స్ నిర్మాణం మరియు ఇతర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. సర్పంచులు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని వారు కోరారు. పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి రాష్ట్రంలోని మొదటి స్థానంలో ఉందని నాలుగు అవార్డులు సొంతం చేసుకున్నదని పేద ప్రజలకు అందుబాటులో నాణ్యమైన చికిత్స అందిస్తున్నారని ఆధుననుతన పరికరాలతో సేవలు అందిస్తున్నారని తెలిపారు. అధికారులు రాబోయే మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సభకు రావాలని ఆదేశించారు.గ్రామాల్లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.పి.ఓ,మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్ ,రాజయ్య,ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ పాఠశాలగా ఎలుకలపల్లి యూపీఎస్

- రాష్ట్ర స్థాయిలో 4వ స్థానం.. దేశ స్థాయిలో 47వ స్థానం
- ఇటీవల పాఠశాల అభివృద్ధికి రూ.10 లక్షలు మంజూరు చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- సోలార్ ప్యానల్స్, వాల్ పెయింటింగ్స్ ఏర్పాటు



**పెద్దపల్లి,ఆగస్టు 18(జనంసాక్షి) :**
పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రతను పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఎస్‌హెచ్‌వీఆర్ కార్యక్రమంలో భాగంగా పాలకుర్తి మండలం ఎల్కలపల్లి యూపీఎస్ పాఠశాల రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి గుర్తింపు పొందింది.ఎల్కలపల్లి యూపీఎస్ పాఠశాల రాష్ట్రస్థాయిలో 4వ స్థానం, దేశస్థాయిలో 47వ స్థానం సాధించి ఉత్తమ స్వచ్ఛ పాఠశాలగా ఎంపికైంది.పాఠశాల అభివృద్ధికి కలెక్టర్ ప్రత్యేక చొరవ పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిన లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి ఇటీవల పాఠశాలను సందర్శించి, విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు రూ.10 లక్షలు మంజూరు చేశారు. కలెక్టర్ చొరవతో పాఠశాలలో సోలార్ ప్యానల్స్, వాల్ పెయింటింగ్స్ తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశారు.పాఠశాలలో పచ్చదనం, పరిశుభ్రతతో పాటు విద్యార్థులకు ఆహ్లాదకరమైన, సౌకర్యవంతమైన విద్యా వాతావరణం కల్పించేందుకు చేపట్టిన చర్యలు పాఠశాల జాతీయ స్థాయిలో ఉత్తమ స్వచ్ఛ పాఠశాలగా ఎంపిక కావడంలో కీలకంగా నిలిచాయి.కలెక్టర్‌కు యూపీఎస్ పాఠశాల జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుమాల లక్ష్మీనారాయణ లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి ను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.పాఠశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసి, మౌలిక వసతుల కల్పనకు సహకరించినందుకు కలెక్టర్‌కు ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సాధించడంలో జిల్లా కలెక్టర్ అందించిన సహకారం ఎంతో ప్రోత్సాహాన్ని అందించిందని పేర్కొన్నారు.

### మంచిర్యాల-వరంగల్ గ్రీన్ ఫీల్డ్ హైవేకు ఆటంకాలు లేకుండా చర్యలు

### కలెక్టర్ కోయ శ్రీహర్ష

- పోతారం గ్రామంలో నేషనల్ హైవే నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్



**పెద్దపల్లి,ఆగస్టు 18(జనంసాక్షి) :**
మంచిర్యాల-వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం ముత్తారం తహసిల్దార్ కార్యాలయంలో నేషనల్ హైవే నిర్మాణ పనుల పురోగతి, భూసేకరణ,నిర్వాసితులకు పరిహారం చెల్లింపులు తదితర అంశాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, మంచిర్యాల-వరంగల్ గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులకు సంబంధించి నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల సమస్యల కారణంగా క్షేత్రస్థాయిలో పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నట్లు నేషనల్ హైవే అధికారులు తన దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు.పోతారం,సర్వారం,ఓడేడు, లక్కారం ప్రాంతాలకు చెందిన రైతులు, నిర్వాసితులతో సమావేశంలో చర్చించిన కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టైటిల్ క్లియర్‌గా ఉన్న రైతులకు సంబంధించి పరిహారం చెల్లింపుల ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.నేషనల్ హైవే నిర్మాణ పనులకు ఎలాంటి ఆటంకాలు రాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భూసేకరణ, పరిహారం చెల్లింపులు తదితర అంశాల్లో క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను రైతులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశించారు.రైతులు,నిర్వాసితులకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని, సమస్యల కారణంగా జాతీయ రహదారి నిర్మాణ పనులు నిలిచిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.రైతులకు నేషనల్ హైవే నిర్మాణానికి సంబంధించిన సమస్యలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వారి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ హామీ ఇచ్చారు.అనంతరం ముత్తారం మండలంలోని పోతారం గ్రామంలో జరుగుతున్న నేషనల్ హైవే నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారులి. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.రైతులు, నిర్వాసితులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ నిర్మాణ పనులు సజావుగా కొనసాగేలా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మంథని ఆర్డిఓ సురేష్,నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్, ముత్తారం తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి, సంబంధిత అధికారులు,పోతారం,సర్వారం,ఓడేడు, లక్కారం ప్రాంతాల రైతులు, నిర్వాసితులు తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ భూ సేకరణను నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష
- పెద్దపల్లి బైపాస్ రోడ్డు, కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి భూ సేకరణ వేగవంతం చేయాలి

**పెద్దపల్లి,ఆగస్టు 18(జనంసాక్షి) :**
అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సంబంధిత అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములతో కలిసి అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ భూ సేకరణపై సంబంధిత అధికారులతో లిజిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షలి సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ పెద్దపల్లి బైపాస్ రోడ్డు, కూనారం రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి, తదితర అభివృద్ధి పనులకు అవసరమైన భూ సేకరణను నిర్ణీత సమయంలోగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.భూ సేకరణ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా రెగ్యులర్‌గా ఫాలోఅప్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూ సేకరణ సజావుగా జరిగేలా అవసరమైన చోట భూ యజమానులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించాలని, అభివృద్ధి పనుల పురోగతికి భూ సేకరణ కారణంగా ఎలాంటి జాప్యం జరగకుండా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అనంతరం కూనారం ఆరోబీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ అక్టోబర్ 15 నాటికి రైల్వే ఓవర్ బ్రిడ్జి పూర్తి చేసి వాహనాల రాకపోకలు జరిగే విధంగా ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈ ఈ. భావ్ సింగ్ , రెవెన్యూ డివిజనల్ అధికారులు బి. గంగయ్య, సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

## ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్' పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

- జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జె.రంగారెడ్డి

**పెద్దపల్లి,ఆగస్టు 18(జనంసాక్షి) :**
తెలంగాణ ప్రభుత్వం, బీసీ సంక్షేమ శాఖ ద్వారా 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ఇంటింటికి ఇందిరమ్మ కుట్టు మిషన్ పథకాన్ని ప్రారంభించిందని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి జె.రంగారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకం ద్వారా బీసీ నిరుద్యోగ మహిళలకు 100% సబ్సిడీతో (యూనిట్ ధర: రూ. 12,000/ ఆటోమేటిక్ కుట్టు మిషన్‌ను అందించి,వారిని ఆర్థికంగా ప్రోత్సహించడం పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని, 18 సంవత్సరాల నుండి 55 ఏళ్ల వయస్సు గల బీసీ మహిళలు అర్హులని, రేషన్ కార్డు కలిగి ఉండి ,వార్షిక కుటుంబ ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలకు మించరాదని, ఆసక్తిగల అభ్యర్థులు సెప్టెంబర్ 15 లోపు ఆన్‌లైన్ ద్వారా హెచ్ టి టి పి ఎస్/టి జి ఓ బి ఎం ఎం సి జి జి గౌ ఇన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని ,ఒక కుటుంబానికి ఒక యూనిట్ మాత్రమే మంజూరు చేయబడుతుందని, ప్రాథమిక అక్షరాస్యత కలిగి ఉండాలని, దరఖాస్తులు అధికంగా వచ్చిన పక్షంలో కనీసం 5వ తరగతి ఉత్తీర్ణతకు ప్రాధాన్యత ఉంటుందని, మేరా/మేరు కమ్యూనిటీకి, వితంతువులు, నిరాశ్రయులు, ఒంటరి మహిళలు, అనాథలు, కుట్టు పనిలో నైపుణ్యం గల వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని, దరఖాస్తులు సంబంధిత ధృవపత్రాల పరిశీలన కొరకు ఎంపీడీఓ /మున్సిపల్ కమిషనర్ /జోనల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని,ఆసక్తి గల అర్హులైన మహిళలు గడువు తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.